




రంజాన్ వేళలు
ఇఫ్తార్ : మంగళవారం 6:25(సాయంత్రం)
సెహరీ : బుధవారం 4:49 (ఉదయం)

- పింఛన్ల పంపిణీపై అబద్ధాల అల్లిక
- చంద్రబాబే కారణమని తప్పుడు ప్రచారం
- ప్రజల్ని మాయ చేసేలా సోషల్ మీడియాలో సందేశాలు





పింఛన్ల పంపిణీపై వలంటీర్ పంపిన వాట్సాప్ సందేశం

వైసీపీ దుష్ప్రచారం..!

ఆత్మకూరు, ఏప్రిల్ 1:

వైసీపీ మళ్లీ బరి తెగించింది. మరో గొబెల్స్ ప్రచారంతో ఎన్నికల్లో లబ్ధి పొందాలని ప్రయత్నిస్తోంది.. అబద్ధపు అల్లికలతో ప్రజల్ని మాయ చేయడంలో వైసీపీ నేతలకు సాటి లేరని చెప్పవచ్చు. ఇందులో భాగంగానే రానున్న ఎన్నికల్లో ఎలాగైనా గెలవాని వైసీపీ చేస్తున్న దుష్ప్రచారాలు అన్నీఇన్నీ కావు. ప్రత్యేకించి తమ వలంటరీలచే ప్రజల్ని మభ్యపెట్టి లబ్ధి పొందేందుకు చేయని కుట్రే లేదు. అయితే కేంద్ర ఎన్నికల కమిషన్ వలంటరీ వ్యవస్థకు షరతులు విధించడంతో వైసీపీ నేతలకు దిక్కుతోచక తప్పుడు ప్రచారాలకు శ్రీకారం చుట్టారు. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో ప్రస్తుతం జరుగుతున్న సార్వత్రిక ఎన్నికల ప్రక్రియలో వలంటరీలు ఎక్కడా పాల్గొనరాదని ఎన్నికల సంఘం ఆదేశాలు జారీ చేసింది. అయినప్పటికీ కొంత మంది వలంటరీలు అత్యుత్సాహాన్ని కనబరిచి వైసీసీ నాయకులతో కలిసి ఎన్నికల ప్రచారాల్లో పాల్గొన్నారు. అలాంటి వారిపై ఫిర్యాదు రావడంతో ఎన్నికల అధికారులు ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటున్నారు. అయితే తాజాగా ఏప్రిల్, మే నెలలకు సంబంధించిన సామాజిక పింఛన్ల పంపిణీల్లో వలంటరీల ప్రమేయం ఉండకూదని, వారికి ప్రభుత్వం నుంచి ఇచ్చిన సెల్‌ఫోన్లను, సిమ్‌కార్డులను స్వాధీనం చేసుకోవాలని ఆదేశాలు కూడా జారీ చేసింది. దీంతో వలంటరీ వ్యవస్థ ద్వారా సామాజిక పింఛన్ లబ్ధిదారులను మభ్యపెట్టవచ్చునన్న వైసీపీ నాయకుల కుట్రలకు ఎన్నికల కమిషన్ షాక్ ఇచ్చింది. అయితే ఈ ఎన్నికల కమిషన్ నిర్ణయాన్ని దుష్ప్రచారం చేసి ప్రజల్ని మాయ చేసేందుకు వైసీపీ ప్రయత్నిస్తున్నట్లు తెలిసింది.

చంద్రబాబే కారణమని నమ్మించేలా తప్పుడు ప్రచారం

వలంటరీ వ్యవస్థ ద్వారా ఎన్నికల్లో లబ్ధి పొందాలని ఆశించిన వైసీపీకి ఎన్నికల కమిషన్ తీసుకున్న నిర్ణయం మింగుడు పడలేదు. దీంతో ఈ విషయంలో టీడీపీ, చంద్రబాబుపై నిందలు మోపేందుకు ఆ పార్టీ నాయకులు అబద్ధాలను అల్లేస్తున్నారు. టీడీపీ అధినేత చంద్రబాబు వల్లే ఒకటో తేదీన అందాల్సిన పింఛన్లు ఆలస్యమయ్యాయని తప్పుడు ప్రచారం చేస్తున్నారు. అంతేకాదు సోషల్ మీడియా ద్వారా అసత్యాలతో కూడిన తప్పుడు సందేశాలను చేరవేస్తున్నారు. ఈ విషయాలను సామాజిక పింఛన్ల లబ్ధిదారులకు తెలియజేయాలని సూచించారు. అలాగే జిల్లా వ్యాప్తంగా వైసీపీ అభ్యర్థులు, ఆ పార్టీ నాయకులు ప్రెస్‌మీట్‌లు పెట్టి ఈవిషయాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు నానా పాట్లు పడుతున్నారు. వాస్తవానికి చాలా వరకు వైసీపీ చేస్తున్న కుతంత్రాలను ప్రజలు గమనిస్తున్నారు. ఇంతకాలం వైసీపీ సేవలో మునిగితేలిన వలంటరీలకు సామాజిక పింఛన్ల పంపిణీ బాధ్యతలు అప్పగిస్తే ఓటర్లను ప్రభావం చేసే ప్రమాదం ఉందని ప్రజలే చర్చించుకుంటున్నారు. ఎన్నికల కమిషన్ తీసుకున్న నిర్ణయాన్ని కూడా స్వాగతిస్తున్నారు. కేవలం రెండు నెలల్లో పింఛన్ రెండు, మూడు రోజుల ఆలస్యమైతే నష్టమేమి ఉండదని పింఛన్ లబ్ధిదారులు కూడా భావిస్తున్నట్లు తెలిసింది. కేవలం ఎన్నికల్లో లబ్ధి పొందేందుకు వైసీపీ నాయకులు చంద్రబాబుపై అసత్యాలతో కూడిన ప్రచారం చేస్తున్నారని మండిపడుతున్నారు.

వైసీపీ దిగజారుడు రాజకీయాలకు ఇదో నిదర్శనం



సామాజిక పింఛన్ల పంపిణీ ప్రక్రియలో వలంటరీ వ్యవస్థ ప్రమేయం ఉండకూదని ఎన్నికల కమిషన్ ఆదేశిస్తే అందుకు కారణం చంద్రబాబేనని ప్రజల్ని మభ్యపెట్టేందుకు వైసీసీ చేస్తున్న తప్పుడు ప్రచారాలు ఆ పార్టీ దిగజారుడు రాజకీయాలకు నిదర్శనం. గత ఎన్నికల్లో వైఎస్ వివేకానందరెడ్డి హత్యను మా పార్టీకి అంటగట్టి విష ప్రచారం చేశారు. ప్రస్తుతం వివేకా హత్యకు కారకులెవరో కూడా ప్రజలకు తెలిసిపోయింది. నిజానికి వైసీపీ చేస్తున్న దుష్ప్రచారాలను నమ్మే పరిస్థితుల్లో ప్రజలెవరూ లేరు. ఇప్పటికే నమ్మి మోసపోయామని తెలుసుకున్నారు. ఇంతకాలం వైసీపీ నాయకుల సేవల్లో తరించిన వలంటరీలు రానున్న ఎన్నికల్లో ఓటర్లను ప్రభావితం చేస్తారన్న ఉద్దేశంతోనే కేంద్ర ఎన్నికల సంఘం పింఛన్ల పంపిణీలో వలంటరీలను దూరం పెట్టింది. దీనివల్ల ఎవరికి ఎలాంటి నష్టం వాటిల్లదు. రెండు, మూడు రోజుల్లో లబ్ధిదారులందరికి పింఛన్ల పంపిణీ జరుగుతోందని ఆశిస్తున్నాం. అదేవిధంగా సామాజిక పింఛన్ల సొమ్మును కూడా దారి మళ్లించి కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించినట్లు తెలిసింది. ఈ కుట్రలను కూడా ప్రజలు గమనిస్తున్నారు.

- బుడ్డా రాజశేఖరరెడ్డి, శ్రీశైలం మాజీ ఎమ్మెల్యే :

సామాజిక పింఛన్లను ఆలస్యంగా పంపిణీ చేసేందుకు కుట్ర..?

సామాజిక పింఛన్ల పంపిణీకి సంబంధించి కేంద్ర ఎన్నికల కమిషన్ వలంటరీ వ్యవస్థను దూరంగా ఉంచడంతో ప్రత్యామ్నాయ విధానాలతో పింఛన్లను పంపిణీ చేయాల్సి ఉంది. వాస్తవానికి గతంతో పోలిస్తే ప్రతి గ్రామ, వార్డుల్లో సచివాయాల సిబ్బంది అందుబాటులో ఉన్నారు. వారి ద్వారా ఒక్క రోజులైనే సామాజిక పింఛన్ లబ్ధిదారుందరికీ పింఛన్ల సొమ్మును పంపిణీ చేయవచ్చు. కానీ సంబంధిత అధికారులు పింఛన్ల పంపిణీని ఆలస్యం చేసేందుకు కుట్ర పన్నినట్లు విమర్శలు వస్తున్నాయి. పింఛన్లు ఆలస్యమైతే అందుకు కారణం చంద్రబాబేనని చెప్పించేందుకే వైసీపీకి చెందిన ముఖ్యనాయకులు పూనుకున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. అలాగే పింఛన్ సొమ్ము అందుబాటులో ఉంచకుండా జగన్ ప్రభుత్వం కాంట్రాక్టర్ల బిల్లుల చెల్లింపునకు వాడినట్లు కూడా ప్రచారం జరుగుతోంది. మొత్తానికి దీనిపై జిల్లా ఉన్నతాధికారులు స్పందించి లబ్ధిదారులకు సకాలంలో పింఛన్లను పంపిణీ చేయాల్సిన అవసరం ఎంతైనాఉంది.

పింఛన్ల పంపిణీలో వలంటరీలను దూరం పెట్టిన ఎన్నికల సంఘం

వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలో తొలిసారిగా వలంటరీ వ్యవస్థను అందుబాటులోకి తీసుకొచ్చారు. ప్రతి 50 ఇళ్లకు ఒకరు చొప్పున చాలా వరకు వైసీపీ సానుభూతిపరులనే వలంటరీలుగా నియమించారు. అంతేకాదు.. వారికి ప్రతినెలా రూ.5200 గౌరవ వేతనాలు కూడా ఇస్తున్నారు. ఇంతకాలం వీరిని వైసీపీ నాయకులు తమ పార్టీకి అనుకూలంగా వాడుకున్నారు. అంతేకాదు.. వలంటరీలు ఎవరో కాదు.. వైసీసీ కార్యకర్తలేనని అనేక సందర్భాల్లో ఆ పార్టీ నాయకులే ప్రచారం చేసుకున్నారు. గత మున్సిపల్, సర్పంచ్ ఎన్నికల్లో కూడా వలంటరీలు వైసీపీ నాయకులకు అనుకూలంగా పని చేసినట్లు విమర్శలు ఉన్నాయి. ఇలా వైసీపీ నాయకుల సేవల్లో తరిస్తూ వలంటరీలు చేస్తున్న విధులేంటో ప్రజలందరికీ తెలుసు. ఈ క్రమంలోనే సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో సంక్షేమ పథకాలను పొందిన లబ్ధిదారులను మభ్యపెట్టేందుకు వలంటరీ వ్యవస్థను వాడుకోవాలని వైసీపీ నాయకులు ప్రయత్నం చేసినట్లు తెలిసింది. దీన్ని ముందే పసిగట్టిన మాజీ చీఫ్ ఎలక్షన్ ఆఫీసర్, సిటిజన్స్ ఫర్ డెమోక్రసీ కార్యదర్శి నిమ్మగడ్డ రమేష్‌కుమార్ ఇటీవల కేంద్ర ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేశారు. ఏప్రిల్, మే నెలకు సంబంధించి సామాజిక పింఛన్ల పంపిణీలో వలంటరీల ప్రమేయం లేకుండా చూడాలని కోరారు. దీంతో సామాజిక పింఛన్ల పంపిణీలో వలంటరీలకు బదులు ప్రత్యామ్నాయ చర్యలతో పంపిణీ చేయాలని కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశించింది.

సిగ్గూ శరం లేకుండా విమర్శలా?



విలేకరులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్‌రెడ్డి

ఎమ్మెల్యే కాటసానిపై బీసీ ఫైర్

బనగానపల్లె, ఏప్రిల్ 1: 'రాజకీయ భిక్ష పెట్టిన తెలుగుదేశం పార్టీపై విమర్శలు చేస్తావా సిగ్గూ, శరం లేదా...' మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం ఆయన బనగానపల్లె పట్టణంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైళ్లలో దోపిడీలు, గొర్రెల దొంగతనాలు, హత్యలు చేయించి డబ్బులు సంపాదించిన వ్యక్తిత్వం ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డిదన్నారు. ఆస్తి కోసం సొంత అన్న నాగార్జునరెడ్డిని హత్య చేసి అది ఆత్మహత్యగా చిత్రీకరించిన ఘనత కాటసాని ఓబుళరెడ్డిదన్నారు. అలాంటి వ్యక్తి తన గురించి మాట్లాడతాడా? అని బీసీ ఫైర్ అయ్యారు. నీచ సంస్కృతి రామిరెడ్డి కొడుకుదన్నారు. రామిరెడ్డి కుమారుడు నాగార్జునరెడ్డి చనిపోతే మానవత్వంతో ఓదార్చడానికి వెళ్లానని, అది తన కుటుంబానికి, రామిరెడ్డి కుటుంబానికి ఉన్న తేడా అన్నారు. ఎవరు ఎలాంటి వారు, ప్రజా సేవ ఎవరు చేస్తారో అందరికీ తెలుసన్నారు. తాము కమీషన్ల కోసం కక్కుర్తి పడాల్సిన అవసరమే లేదన్నారు. ఎప్పటికైనా తమది సాయం చేసే వ్యక్తిత్వమన్నారు. తప్పుడు విధానాలతో రాజకీయం చేయడం ఎమ్మెల్యే కాటసానికే చెల్లుతుందన్నారు. ప్రజాభిమానం చూరగొని ఓట్లు అడగాలి కాని బెదిరిస్తే భయపడే స్థితిలో ప్రజలు లేరన్నారు. తన సహనాన్ని పరీక్షిస్తే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని బీసీ హెచ్చరించారు. ఏదైనా రాజకీయంగా మాట్లాడటం నేర్చుకోవాలని ఆయన హితవు పలికారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు బీసీ రామనాథరెడ్డి, బురానుద్దీన్, కాట్రెడ్డి మల్లికార్జునరెడ్డి, వంగల పరమేశ్వరరెడ్డి, బొబ్బల గోపాల్‌రెడ్డి, రాయలసీమ సలాం, కలాం, ఇస్మాయిల్ ఖాన్ పాల్గొన్నారు.


ఎన్నికల నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు: ఎస్పీ



నంద్యాల క్రైం, ఏప్రిల్ 1 : ఎవరైనా ఎన్నికల నిబంధనలు ఉల్లంఘించిట్లయితే చట్టపరంగా చర్యలు తప్పవని ఎస్పీ కె.రఘువీర్‌రెడ్డి హెచ్చరించారు. సోమవారం ఆయన నంద్యాల జిల్లా పోలీస్ కార్యాలయంలో మాట్లాడారు. ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు ఎవరైనా ప్రజలను ప్రలోభాలకు గురిచేస్తే చట్టపరంగా చర్యలు తప్పవన్నారు. మద్యం, నగదు, బంగారం, వెండి ఇతర ప్రోత్సాహక బహుమతుల అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేసేందుకు నంద్యాల జిల్లా ఎన్నికల అధికారి ఆధ్వర్యంలో జిల్లాలోని అన్ని మార్గాల్లో చెక్‌పోస్టులు ఏర్పాటు చేసినట్లు ఎస్పీ తెలిపారు. చెక్‌పోస్టుల వద్ద సిబ్బంది షిఫ్టుల వారీగా 24గంటలు విధులు నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. జిల్లా సరిహద్దుల్లోని చెక్‌పోస్టులతోపాటు అంతర్గత చెక్‌పోస్టులు, విజిబుల్ పోలీసింగ్‌లో, జిల్లాలోని ఫ్లయింగ్ స్క్వాడ్ టీమ్‌లు, స్టాటిక్ సర్వలైన్స్ టీమ్‌లు, ఎంసీసీ టీమ్‌లు ఎన్నికల నియమ నిబంధనలకు లోబడి పని చేస్తాయని తెలిపారు. నగదు, బంగారం, వెండి, ప్రోత్సాహక బహుమతులు తదితర వాటిని సీజ్ చేసి త్రీ మ్యాన్ కమిటీకి అప్పగిస్తామని చెప్పారు. పట్టుబడిన నగదు, బంగారం నగలకు సంబంధించి యజమానులు సరైన పత్రాలు సమర్పించి తిరిగి పొందవచ్చని తెలిపారు. ఇప్పటివరకు జిల్లా మొత్తంపై ఎన్నికల నిబంధనలు అతిక్రమించిన వారిపై 24 కేసులు నమోదు చేశామన్నారు. ఎన్నికల నిబంధనల మేరకు రూ.50వేల కంటే ఎక్కువగా నగదు, ఇతర విలువగల వస్తువులు రవాణా చేసినట్లయితే సంబంధిత ధృవపత్రాలు తప్పనిసరిగా వెంట ఉంచుకోవాలని సూచించారు. అలాగే బ్యాంక్‌ల నుంచి రూ.50వేల కంటే ఎక్కువగా నగదు డ్రా చేస్తే బ్యాంక్‌లోనే అందుకు సంబంధించిన సరైన ఆధారాలు పొందాలన్నారు. ఎన్నికల నిబంధనల మేరకు ఎవరైనా ర్యాలీలు, మైక్‌లు, పార్టీలకు సంబంధించిన వాహనాలకు సంబంధించిన ఆర్‌ఓ వద్ద సరైన అనుమతి పొందాలని కోరారు.

స్పాట్.. స్టార్ట్

- ప్రారంభమైన 'పది మూల్యాంకనం'
- పెండింగ్‌లో గతేడాది మూల్యాంకన బకాయిలు
- రాష్ట్రంలో నంద్యాల జిల్లాకు అత్యధిక జవాబు పత్రాలు
- ఈ నెల 8 వరకు మూల్యాంకనం



నంద్యాల నూనెపల్లె /పాణ్యం, ఏప్రిల్ 1: పదో తరగతి పబ్లిక్ పరీక్షల జవాబు పత్రాల మూల్యాంకనం (స్పాట్ వాల్యుయేషన్) సోమవారం నుంచి ప్రారంభమైంది. నంద్యాల జిల్లా ఏర్పడిన అనంతరం మొట్టమొదటి సారిగా 'పది మూల్యాంకనం' నిర్వహిస్తున్నారు. పాణ్యం సమీపంలోని శాంతిరాం ఇంజనీరింగ్ కళాశాలలో మూల్యాంకన కేంద్రాన్ని అధికారులు ఏర్పాటు చేశారు. సోమవారం నుంచి ప్రారంభమైన మూల్యాంకనం ఈనెల 8వ తేదీ వరకు జరగనుంది. వివిధ జిల్లాల నుంచి వచ్చిన పరీక్షా పేపర్లకు సంబంధించి సిబ్బంది కోడింగ్ ప్రక్రియ ఇప్పటికే పూర్తయింది. ప్రతిరోజు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 లేదా 6 గంటల వరకు మూల్యాంకనం చేస్తారు. రాష్ట్రంలోనే నంద్యాల జిల్లాకు అత్యధికంగా 2.38 లక్షల జవాబుపత్రాలు కేటాయించడం విశేషం. అయితే గత ఏడాది ఉమ్మడి కర్నూలు జిల్లాలో జరిగిన స్పాట్ వాల్యుయేషన్‌కు సంబంధించి పారితోషికం చాలా మంది సిబ్బందికి పెండింగ్‌లో ఉంది. పదో తరగతి స్పాట్ వాల్యుయేషన్‌కు సంబంధించి సిబ్బందికి, అధికారులకు పారితోషికం ఇస్తారు. గతేడాది ఉమ్మడి కర్నూలు జిల్లాలో జరిగిన మూల్యాంకనంలో ఇప్పటికీ చాలా మంది సిబ్బందికి పారితోషికం జమకాలేదు. మూల్యాంకనంలో పాల్గొనే సిబ్బంది, అధికారులకు మూల్యాంకనం ఆఖరి రోజునే సొమ్ము చెల్లిస్తారు. గత సంవత్సరం మాత్రం 5,6 నెలల తర్వాత కొంత మంది సిబ్బంది ఖాతాల్లో పారితోషికం జమ అయింది. ఇంకా కొంత మందికి అందలేదనే ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి.

రాష్ట్రంలోనే అత్యధికంగా..

నంద్యాల జిల్లాగా ఏర్పడిన అనంతరం మొదటి సారిగా నంద్యాల జిల్లా కేంద్రంలో పదవ తరగతి జవాబు పత్రాల మూల్యాంకనం నిర్వహిస్తున్నారు. రాష్ట్రంలోనే ఏ జిల్లాకు కేటాయించని పేపర్లను నంద్యాల జిల్లాకు 2.38 లక్షల పేపర్లు కేటాయించారు. అవసరమైతే 20 శాతం అదనంగా సిబ్బందిని ఏర్పాటు చేసేందుకు సిద్ధంగా ఉన్నట్లు డీఈఓ సుధాకర్‌రెడ్డి వెల్లడించారు. పదో తరగతి స్పాట్ వాల్యుయేషన్ ప్రక్రియలో 1,040 మంది సిబ్బంది విధులు నిర్వర్తిస్తున్నారన్నారు. స్పాట్ వాల్యుయేషన్‌కు 120 మంది చీఫ్ ఎగ్జామినర్లు, 720 మంది అసిస్టెంట్ ఎగ్జామినర్లు, 200 మంది స్పెషల్ అసిస్టెంట్లను నియమించామన్నారు. సిబ్బందికి అవసరమైన మౌలిక వసతులతో పాటు మెడికల్ సిబ్బందిని కూడా నియమించి, పోలీస్ బందోబస్తును ఏర్పాటు చేసినట్లు డీఈఓ తెలిపారు.

పెరిగిన పారితోషికం

ఈ ఏడాది మూల్యాంకన పారితోషికం పెంచుతూ ఉత్తర్వులు జారీ అయినట్లు అధికారులు చెబుతున్నారు. ప్రక్రియలో కీలకమైన ఏఈలకు ప్రతి పేపర్ దిద్దినందుకు ఇప్పటి వరకు రూ.6.60 ఇవ్వగా, తాజాగా రూ.10కి పెంచారు. తప్పులు సరిదిద్దే స్పెషల్ అసిస్టెంట్లకు రోజుకు రూ.137.50 నుంచి రూ.300 పెంచారు. సీఈలకు రూ.264 నుంచి రూ.396, ఏసీవోలకు రూ.286 నుంచి రూ.429, డిప్యూటీ క్యాంప్ అధికారులకు రూ.330 నుంచి రూ.495, క్యాంప్ అధికారికి రూ.385 నుంచి రూ.578 వరకు పెంచినట్లు ఉత్తర్వులు జారీ అయ్యాయి. వాస్తవానికి గత ఏడాదే ఈవిధంగా చెల్లింపులు అమలు కావాల్సి ఉన్నా పంపిణీలో జరిగిన జాప్యత వల్ల సాధ్యం కాలేకపోయింది.



మూల్యాంకనం కేంద్రం వద్ద ఉపాధ్యాయులకు సూచనలు చేస్తున్న డీఈఓ

భక్తులు అసౌకర్యానికి గురి కాకూడదు


- ఉగాది మహోత్సవాలకు పకడ్బందీ చర్యలు చేపట్టండి
- కలెక్టర్ డాక్టర్ కె.శ్రీనివాసులు ఆదేశం

నంద్యాల (కల్చరల్), ఏప్రిల్ 1: శ్రీశైలంలో ఈ నెల 6 నుంచి 11వ తేదీ వరకు నిర్వహించే ఉగాది మహోత్సవాలలో భక్తులు అసౌకర్యానికి గురికాకుండా అన్ని జాగ్రత్త చర్యలు తీసుకోవాలని కలెక్టర్ డాక్టర్ కె.శ్రీనివాసులు అన్నారు. సోమవారం కలెక్టరేట్లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో ఎస్పీ రఘువీర్‌రెడ్డి, జాయింట్ కలెక్టర్ రాహుల్‌కుమార్‌రెడ్డితో కలిసి సంబంధిత జిల్లా అధికారులతో సమీక్ష జరిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కర్ణాటక నుంచి వచ్చే కన్నడ భక్తులు వడదెబ్బకు గురికాకుండా చర్యలు తీసుకోవాలని అన్నారు. జిల్లాలోని ఎంట్రీ పాయింట్ నుంచి శ్రీశైలం చేరే వరకు అవసరమైన అన్ని ప్రాంతాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. వెంకటాపురం నుంచి శ్రీశైలం వరకు వచ్చే పాదయాత్ర భక్తులకు అటవీమార్గంలో 13 మెడికల్ క్యాంపులు నిర్వహించాలని అన్నారు. తాగునీరు, పారిశుద్యం, పార్కింగ్, ప్రదేశాలు, భక్తుల దర్శన క్యూలైన్లు, లడ్డూ ప్రసాద కౌంటర్లు తదితరాలపై దృష్టి సారించి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎస్పీ రఘువీర్‌రెడ్డి మాట్లాడుతూ హటకేశ్వరం వద్ద ఉన్న దుకాణాలను వెనక్కి తరలించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. క్యూలైన్లలో మెస్ ఎత్తును పెంచాలని, క్యూలైన్లలోని భక్తులకు నీరు, మజ్జిగ సరఫరా చేయించాలన్నారు. జేసీ రాహుల్ కుమార్‌రెడ్డి మాట్లాడుతూ వేసవి దృష్ట్యా ఉద్యానవనాలు పార్కింగ్ ప్రదేశాల్లో చలువ పందిళ్లు, భక్తుల రద్దీకి అనుగుణంగా మొబైల్ టాయిలెట్లు, షవర్ బాత్‌లు ఏర్పాటు చేయాలని ఈవోకు సూచించారు. హోటళ్లలో విక్రయించే తినుబండారాలను శ్యాంపిల్స్‌ను సేకరించి నిబంధనలు ఉల్లంఘించిన వారి దుకాణాల లైసన్సులను రద్దు చేయాలని సూచించారు. అనంతరం ఈవో పెద్దిరాజు పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ఉగాది ఉత్సవాల కోసం చేస్తున్న ఏర్పాట్లను వివరించారు. ఈ సమావేశంలో డీఆర్వో పద్మజ, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న కలెక్టర్, ఎస్పీ, జేసీ, డీఆర్వో తదితర అధికారులు

శ్రీశైలం ధర్మకర్తల మండలి నిర్ణయాలపై పిటిషన్



శ్రీశైలం, ఏప్రిల్ 1 : శ్రీశైలం దేవస్థానం ధర్మకర్తల మండలిలో తీసుకున్న పలు నిర్ణయాలపై రాష్ట్ర ఉన్నత న్యాయస్థానంలో పిటిషన్ దాఖలైంది. మండలిలో తీసుకున్న పలు నిర్ణయాలను అభ్యంతరం వ్యక్తం చేస్తూ హిందూ జనశక్తి వెల్ఫేర్ అసోసియేషన్ దేవదాయశాఖ అధికారులకు లేఖలు పంపింది. లేఖలపై ఎటువంటి స్పందన లేకపోవడంతో పిటిషనర్ హైకోర్టును ఆశ్రయించినట్లు తెలిసింది. సోమవారం సదరు పిటిషన్‌ను రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం విచారించి ప్రతివాదులైన దేవస్థానం ఉన్నతాధికారులకు నోటీసులు జారీ చేసింది. అయితే గత నెల 25వ తేదీన ఆలయ పాలకమండలి ఛైర్మన్ రెడ్డివారి చక్రపాణిరెడ్డి సారథ్యంలోని ధర్మకర్తల మండలి రెండేళ్ల కాలపరిమితి గడువు ముగిసిన విషయం తెలిసిందే.



వైసీపీలో ప్రకంపనలు..!

- దోన్ అధికార పార్టీలో మొదలైన తిరుగుబాట్లు
- టీడీపీ గూటికి చేరిన పలువురు వైసీపీ నాయకులు
- ఇప్పటికే పార్టీలో చేరిన డోన్ మార్కెట్ యార్డు చైర్మన్
- కోట్ల దంపతులతో మరికొంత మంది టచ్‌లో..
- 4న మున్సిపల్ వైస్ చైర్మన్ టీడీపీలోకి....?
- మంత్రి బుగ్గన ఉక్కిరి, బిక్కిరి

డోన్, ఏప్రిల్ 1: అలకలు.. అసంతృప్తులు.. ధిక్కార స్వరం.. తిరుగుబాట్లు వెరసి.. డోన్ నియోజకవర్గ వైసీపీలో ప్రకంపనలు రేపుతున్నాయి. ఎన్నికల వేళ రోజుకో దెబ్బ తగులుతుండటంతో వైసీపీలో వణుకు పుడుతుంది. మొన్నటి వరకు నియోజకవర్గాన్ని శాసించిన మంత్రి బుగ్గనపై ధిక్కారస్వరం పెరుగుతోంది. అధికార పార్టీలోని పలువురు అసంతృప్తి నేతలు తిరుగుబాటు జెండా ఎగురవేస్తున్నారు. ఈ పరిమాణాలతో మంత్రి బుగ్గన ఉక్కిరి బిక్కిరి అవుతున్నారు. రాష్ట్రంలో ఎంతో ప్రాధాన్యత ఉన్న డోన్ నియోజకవర్గంపై అందరి దృష్టి పడింది. ఆర్థిక మంత్రి బుగ్గన ఇక్కడి నుంచే ప్రాతినిధ్యం వహిస్తుండటమే ఇందుకు కారణమని చెప్పవచ్చు. వైసీపీ నుంచి రెండుసార్లు ఎమ్మెల్యేగా ఎన్నికైన బుగ్గన మూడోసారి ఇక్కడి నుంచి పోటీ చేస్తున్నారు. ఐదేళ్ల పాటు ఆర్థిక మంత్రిగా ఉన్న బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి డోన్ నియోజకవర్గంలో తాను చెప్పిందే వేదమన్నట్లు పాలన సాగించారు. పార్టీని కూడా తన కనుసైగల్లో నడిపించారు. కానీ ప్రస్తుతం మంత్రి బుగ్గన నియోజకవర్గంలో సొంత పార్టీ నేతల నుంచే విచిత్రమైన పరిస్థితిని ఎదుర్కొంటున్నారన్న చర్చ రాజకీయ వర్గాల్లో సాగుతోంది.

● వైసీపీలో తిరుగుబాట్ల దడ:

ఐదేళ్లపాటు తన కనుసైగలతో వైసీపీ నేతలను శాసించిన మంత్రి బుగ్గనకు దిమ్మతిరిగే షాక్ ఇస్తున్నారు. సొంత పార్టీనేతలే తిరుగుబాటు చేసి మంత్రికి ఝలక్ ఇస్తున్నారు. తాజాగా డోన్ మార్కెట్ యార్డు చైర్మన్ రాజా నారాయణమూర్తి వైసీపీకి గుడ్‌బై చెప్పారు. టీడీపీ కూటమి డోన్ అభ్యర్థి కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ, తనయుడు కోట్ల రాఘవేంద్రరెడ్డిల సమక్షంలో రాజా నారాయణమూర్తి టీడీపీలో చేరారు. అదేవిధంగా ప్యాపిలి మండలంలోని గార్లదిన్నెకు చెందిన జిల్లా సహకార కేంద్ర బ్యాంకు డైరెక్టర్ సీమ సుధాకర్ రెడ్డి, గార్లదిన్నె సర్పంచ్ మనోహరమ్మలు వైసీపీని వీడారు. మరో మూడు రోజుల్లో కోట్ల సమక్షంలో టీడీపీలో చేరనున్నారు. అదే మండలంలోని మరి కొందరు అసంతృప్తి వైసీపీ నేతలు టీడీపీలో చేరేందుకు రంగం సిద్ధం చేసుకుంటున్నారు. బేతంచెర్లలో మంత్రి స్వయాన బంధువు బుగ్గన ప్రభాకర్ రెడ్డి వైసీపీని వీడి టీడీపీలో చేరడం అధికార పార్టీకి షాక్ తగిలినట్లయింది. డోన్ మండలంలో పలువురు వైసీపీ సర్పంచులు అసంతృప్తితో రగిలిపోతున్నారు. దాదాపు ఏడుగురు సర్పంచులు టీడీపీలో చేరేందుకు సిద్ధమయ్యారు. డోన్ మండలంలో ముగ్గురు బలమైన వైసీపీ నాయకులు మంత్రి బుగ్గనపై అసంతృప్తులతో రగిలిపోతున్నారు. వైసీపీకి గుడ్‌బై చెప్పి టీడీపీలో చేరేందుకు సిద్ధమయ్యారు.



రాజా నారాయణమూర్తి



సీమ సుధాకర్ రెడ్డి



టీడీపీలో చేరిన బుగ్గన ప్రభాకర్ రెడ్డి (ఫైల్)

● బుగ్గన ఉక్కిరి.. బిక్కిరి:

డోన్ నియోజకవర్గంలో కోట్ల దంపతుల దూకుడుతో మంత్రి బుగ్గన ఉక్కిరి బిక్కిరి అవుతున్నారు. మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ, నేరుగా రంగంలోకి దిగి పలువురు వైసీపీ నాయకులకు తనదైన రీతిలో మద్దతు కోరుతున్నారు. వీటికి తోడు వైసీపీలో ఉన్న అసంతృప్తులతో మంత్రి బుగ్గన ఉక్కిరి బిక్కిరి అవుతున్నారు. పార్టీ నేతలు తిరుగుబాటు చేస్తుండటంతో మంత్రి బుగ్గనకు దిక్కుతోచని పరిస్థితి నెలకొంది. మొత్తానికి నియోజకవర్గంలో వైసీపీలో మొదలైన తిరుగుబాట్లను ఆపేందుకు మంత్రి చేస్తున్న ప్రయత్నాలు ఫలించడం లేదు.



పార్టీ మారేందుకు సిద్ధమైన వైస్ చైర్మన్?

డోన్ మున్సిపాలిటీలో వైసీపీ కీలకనేత టీడీపీలో చేరేందుకు రంగం సిద్ధమైంది. ఈనెల 4వ తేదీన మున్సిపల్ వైస్ చైర్మన్ కోట్రికే హరికిషన్ టీడీపీ కూటమి డోన్ అసెంబ్లీ అభ్యర్థి కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి సమక్షంలో ముహూర్తం ఖరారు చేశారు. మంత్రి బుగ్గనపై తీవ్ర అసంతృప్తితో ఉన్న కోట్రికే హరికిషన్ ఇప్పటికే వైసీపీ కార్యక్రమాలకు పూర్తి దూరంగా ఉన్నారు. హరికిషన్ పార్టీని వీడుతున్నారన్న సమాచారం వైసీపీలో కలకలం రేపుతోంది.

● ఎన్నికల వేళ.. ఎంత తేడానో.!

ఎన్నికల వేళ.. మంత్రి బుగ్గనలో ఎంత తేడానో అన్న చర్చ రాజకీయ వర్గాల్లో సాగుతోంది. వైసీపీ నేతల్లో అసంతృప్తి నేతలను బుజ్జగించేందుకు మంత్రి బుగ్గన నానా తంటాలు పడుతున్నారు. గతంలో వైసీపీ నాయకులు ఏదైనా పనిమీద ఫోన్లు చేస్తే మంత్రి బుగ్గన నుంచి ఒక రకమైన సమాధనం ఉండేదని సొంత పార్టీ నేతలే చెబుతున్నారు. ఇప్పుడు స్వయంగా మంత్రినే ఫోన్లు చేసి పార్టీ కోసం పని చేయాలని బతిమలాడుతున్న తీరుపై ఎంత తేడానో అని వైసీపీ నేతలు చర్చించుకుంటున్నారు. పలువురు అసంతృప్తి నేతలను బుజ్జగించేందుకు మంత్రి చేస్తున్న ప్రయత్నాలతో.. కొందరు నాయకులు ఫోన్లను స్విచ్ఛాఫ్ చేసుకుంటున్నారన్న చర్చలు సాగుతోంది.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య



విజయ్ కుమార్ (ఫైల్)

పత్తికొండ, ఏప్రిల్ 1: పత్తికొండ మండల పరిధిలోని చందోలి గ్రామానికి చెందిన విజయ్ కుమార్ (32) అనే రైతు అప్పులబాధ తాళలేక ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఆదివారం రాత్రి ఇంట్లో అందరూ నిద్రించిన తర్వాత విజయ్ కుమార్ ఉరి వేసుకోగా.. సోమవారం ఉదయం కుటుంబ సభ్యులు గమనించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. అప్పుల బాధతోనే తన భర్త ఆత్మహత్య చేసుకున్నాడని భార్య సురేఖ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నామని ఎస్ఐ వెంకటేశ్ తెలిపారు.

గంజి మీద పడి ఐదేళ్ల బాలుడికి గాయాలు

హొళగుంద, ఏప్రిల్ 1: అభం శుభం తెలియని ఐదేళ్ల బాలుడిపై ఓ అంగన్వాడీ ఆయా అన్నం వార్చిన గంజిని వేయడంతో తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన హొళగుంద మండలం గజ్జెహళ్లి గ్రామంలోని అంగన్వాడీ-2వ కేంద్రంలో చోటు చేసుకుంది. స్థానికుల వివరాల మేరకు.. బాలస్వామి, ఉలిగమ్మ దంపతుల కుమారుడు ఐదేళ్ల మల్లప్ప రోజులాగే సోమవారం ఉదయం అంగన్వాడీ కేంద్రానికి చదువుకునేందుకు వెళ్లాడు. ఉదయం 10:30 సమయంలో అంగన్వాడీ కేంద్రం పక్కనున్న పొదల్లో మూత్ర విసర్జన చేసి తిరిగి వస్తుండగా అంగన్వాడీ ఆయా లక్ష్మీ అప్పుడే అన్నం వార్చిన వేడివేడి గంజిని బయటకు పడేసింది. ఆ గంజి అక్కడే ఉన్న బాలుడి మొహం, ఛాతిపై పడటంతో ఒళ్లు కాలి బొబ్బలు వచ్చాయి. కాలిన మంటలకు బాలుడు గట్టిగా అరవడంతో గమనించిన ఆయా బాలుడిని స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రథమ చికిత్స చేయించి ఆ బాలుడి ఇంటి ముందు వదిలి వెళ్లిపోయింది. ఒళ్లంతా గాయాలతో ఉన్న బాలుడిని గమనించిన తల్లిదండ్రులు విషయం తెలుసుకుని అంగన్వాడీ సిబ్బందితో వాగ్వివాదానికి దిగారు. అనంతరం బాలుడికి మెరుగైన వైద్యం కోసం ఆదోని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించారు. విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించిన అంగన్వాడీ ఆయా, సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకోవాలని కుటుంబ సభ్యులు, గ్రామస్థులు కోరుతున్నారు. ఈ విషయంపై అంగన్వాడీ టీచర్ జ్యోతిని వివరణ కోరగా పొరపాటున జరిగిందని, ఇలాంటి సంఘటనలు మరలా జరుగకుండా పూర్తి బాధ్యతతో వ్యవహరిస్తామని తెలిపారు.

పింఛన్ డబ్బులు మళ్లింపు

టీడీపీ జిల్లా అధ్యక్షుడు బీటీ నాయుడు



కర్నూలు(అర్బన్), ఏప్రిల్ 1: పింఛన్ల డబ్బును సీఎం జగన్మోహన్‌రెడ్డి కాంట్రాక్టర్లకు దోచిపెట్టారని జిల్లా టీడీపీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బీటీ నాయుడు అన్నారు. సోమవారం జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో మాట్లాడారు. సచివాలయ సిబ్బంది, గ్రామ కార్యదర్శులతో పింఛన్లు పంపిణీ చేయించకపోవడానికి నిధుల కొరతే కారణమని అన్నారు. ఈ నెల 1న ఇంటి వద్దే పింఛన్లు పంపిణీ చేయాలని జగన్‌రెడ్డి ఎందుకు ఆదేశాలు ఇవ్వలేదని ప్రశ్నించారు. రాష్ట్రంలో 1.35 లక్షల సచివాలయ సిబ్బంది ద్వారా యుద్ధ ప్రాతిపదికన పింఛన్లు ఇంటి వద్దే పంపిణీ చేయడానికి సాధ్యమవుతుందని, జగన్‌రెడ్డి స్వార్థ రాజకీయాల వల్లే పింఛన్‌దారులు, వలంటీర్లు నష్టపోతున్నారన్నారు. టీడీపీ అధికారంలోకి రాగానే ఇంటి వద్దకే నెలకు రూ.4 వేల పింఛన్ అందిస్తుందని తెలిపారు. ఒకటో తారీఖున పెన్షనర్లకు ఇవ్వాల్సిన డబ్బును జనవరి 23న బటన్ నొక్కి ఆసరా డబ్బును, ఫిబ్రవరి 16న బటన్ నొక్కిన ఈబీసీ నేస్తం డబ్బును ఆరోగ్యశ్రీకి ఇవాల్సిన నిధులు రూ 13 వేల కోట్లు మార్చి 16 నుంచి 30 వరకు లోపు అంటే 15 రోజుల్లోనే జగన్‌రెడ్డి అనుకూలమైన కాంట్రాక్టర్లకు మొత్తం దోచిపెట్టారని ఆరోపించారు. దుర్మార్గాన్ని కప్పిపెట్టుకోవడానికి ఎన్నికల కమిషన్, నిమ్మగడ్డ రమేష్ కుమార్, తెలుగుదేశం పార్టీపైన దుష్ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు.

బైక్ పై నుంచి పడి ఒకరి మృతి

ఇద్దరి పరిస్థితి విషమం



మోనేష్ ఆచారి (ఫైల్)

కోసిగి, ఏప్రిల్ 1: బైక్ అదుపు తప్పి జరిగిన ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందగా మరో ఇద్దరు తీవ్ర గాయాలపాలైన ఘటన కోసిగి మండలంలోని లక్మారి గ్రామ సమీపంలో చోటు చేసుకుంది. కోసిగి మండల కేంద్రానికి చెందిన మోనేష్ ఆచారి(25), శ్రీకాంత్ ఆచారి, నూరిపోగు బాషా ముగ్గురు స్నేహితులు. వీరు సొంత పనుల నిమిత్తం రాయచూరు జిల్లా గిలకసూగూరు క్యాంప్‌నకు వెళ్లి బయలుదేరారు. తిరిగి వస్తుండగా ఆదివారం రాత్రి 11 గంటల సమయంలో లక్మారి గ్రామ సమీపంలోని దేవాలయం దగ్గర బైక్ అదుపు తప్పి ముగ్గురూ కిందకు పడ్డారు. వీరిని కర్నూలు ఆసుపత్రికి అంబులెన్సులో తరలిస్తున్న సమయంలో కోడుమూరు సమీపంలో మోనేష్ ఆచారి మృతి చెందాడు. నూరిపోగు బాషా పరిస్థితి విషమంగా ఉండటంతో కోమాలోకి వెళ్లినట్లు వైద్యవర్గాలు వెల్లడించాయి. శ్రీకాంత్ ఆచారికి కాళ్లు, చేతులు విరిగిపోవడంతో మెరుగైన వైద్యం కోసం కర్నూలుకు తరలించారు. ఒక ప్రమాదం మూడు కుటుంబాల్లో విషాదఛాయలు నింపాయి. కోసిగిలోని 9వ వార్డు రైల్వేగేటు సమీపంలో విషాదచాయలు అలుముకున్నాయి. కమ్మరి శ్రీనివాసులు, ఈశ్వరమ్మ దంపతులకు ఇద్దరు కుమారులు, ముగ్గురు కూతుళ్లు. చిన్నవాడు మోనేష్ ఆచారి ఏడాది క్రితమే పెళ్లయింది. మృతుడి భార్య ప్రియాంక నాలుగు నెలల గర్భిణి. భర్త చిన్న వయసులోనే చనిపోవడంతో భార్య ప్రియాంకతో పాటు కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి. మాధవరం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పరిశోధనల్లో మెళకువలు పాటించాలి



మాట్లాడుతున్న డాక్టర్ ఎల్ ప్రశాంతి

యాజమాన్యం, యాంత్రీకరణకు ప్రాధాన్యత ఇవ్వాలి

ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిశోధనా సంచాలకురాలు డాక్టర్ ప్రశాంతి

ఆర్ఏఆర్ఎస్ ఆధ్వర్యంలో పరిశోధన - విస్తరణ సలహా మండలి సమావేశం

నంద్యాల టౌన్, ఏప్రిల్ 1 : వ్యవసాయ రంగ పురోభివృద్ధి కోసం శాస్త్రవేత్తల పరిశోధనల ఫలితాలకు అనుగుణంగా వచ్చే మెళకువలను రైతులు పాటించాలని, లాభసాటి వ్యవసాయం వైపు దృష్టి సారించాలని ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిశోధనా సంచాలకురాలు (డైరెక్టర్ ఆఫ్ రీసెర్చ్) డాక్టర్ ఎల్ ప్రశాంతి అన్నారు. సోమవారం నంద్యాల ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం ఆధ్వర్యంలో ఆర్ఏఆర్ఎస్ సెంటనరీ భవన్‌లో పరిశోధన - విస్తరణ (జడ్ఆర్ఈఏసీ) సలహా మండలి సమావేశం జరిగింది. ఆర్ఏఆర్ఎస్ ఏడీఆర్ డాక్టర్ సరళమ్మ అధ్యక్షతన కార్యక్రమం నిర్వహించారు. అత్యల్ప వర్షపాతం నమోదవుతున్న నాలుగు జిల్లాలైన నంద్యాల, కర్నూలు, అనంతపురం, సత్యసాయి జిల్లాల్లోని పరిస్థితులపై చర్చించారు. పరిశోధనా సంచాలకురాలు డాక్టర్ ఎల్ ప్రశాంతి మాట్లాడుతూ కొత్త వంగడాలు, యాంత్రీకరణ, సమగ్ర సస్యరక్షణ అంశాలతోపాటు శాస్త్రవేత్తల సలహాలు, సూచనలు పాటించాలని రైతులకు సూచించారు. విస్తరణ విభాగం సంచాలకులు డాక్టర్ కేఎస్ఎస్ నాయక్ మాట్లాడుతూ ఈ ఏడాదిలో వైవిధ్యమైన వర్షపాతం నమోదు కావడం వల్ల వివిధ పంటల్లో తక్కువ దిగుబడులు నమోయ్యాయని అన్నారు. వేరుశనగతోపాటు ఆముదం, తదితర పంటల సాగుకు రైతులు మొగ్గు చూపాలని కోరారు. వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ విజయలక్ష్మి మాట్లాడుతూ వరిలో సంకర రకాల అభివృద్ధి, వేరుశనగలో పెండి మెథాలిన్ బదులు డైక్లోసూలమ్, శనగలో అంతర కృషితోపాటు కలుపు మందుల పిచికారికి పరిశోధనలు ఆశాజనకంగా ఉన్నాయన్నారు. బోర్డు డైరెక్టర్ మురళీధర్‌రెడ్డి మాట్లాడుతూ పరిశోధనలు అకాడమిక్ పరంగా కాకుండా రైతుల ఆధారితంగా ఉండాలని, ఎప్పటికప్పుడు పరిశోధనా ఫలితాలను రైతులకు క్షేత్రస్థాయిలో అందేలా చేయాలని అన్నారు. పత్తి సాగు, వేరుశనగ, నూనెగింజల్లో మేలైన పరిశోధనలు చేయాలని అన్నారు. ఆర్ఏఆర్ఎస్ ఏడీఆర్ డాక్టర్ సరళమ్మ మాట్లాడుతూ 2023 - 2024 సంవత్సరానికి సంబంధించి పరిశోధనలు, విస్తరణల ఫలితాలను వివరించారు. సదస్సులో పలువురు పంటల యాజమాన్యాలకు సంబంధించి ప్రశ్నించగా శాస్త్రవేత్తలు సమాధానాలు ఇచ్చారు. సమావేశంలో నంద్యాల డీఏవో మోహన్‌రావు, కర్నూలు డీఏవో వరలక్ష్మి, అనంతపురం డీఏవో ఉమామహేశ్వరమ్మ, సత్యసాయి జిల్లా డీఏవో సుబ్బారావుతోపాటు వ్యవసాయ శాఖ, వ్యవసాయ అనుబంధనల శాఖల అధికారులు, రైతులు పాల్గొన్నారు.

అల్లూరులో హైడ్రామా



టీడీపీ నాయకుల ఫొటోలు తీస్తున్న హైదరాబాద్ సీసీఎస్ సీఐ

- మాండ్ర అరెస్టుకు తెలంగాణ పోలీసుల యత్నం
- నోటీసులు చూపించాలన్న శివానందరెడ్డి

నందికొట్కూరు, ఏప్రిల్ 1: నందికొట్కూరు మండలం అల్లూరు గ్రామంలో సోమవారం హైడ్రామా నడిచింది. నంద్యాల పార్లమెంట్ టీడీపీ ఇన్‌చార్జి మాండ్ర శివానందరెడ్డిని అరెస్టు చేయడానికి వచ్చామంటూ తెలంగాణ పోలీసుల బృందం హడావుడి చేసింది. వివరాలు ఇలా.. తెలంగాణ సీసీఎస్ సీఐ రాజేష్ ఆధ్వర్యంలో పోలీసులు సోమవారం ఉదయం 6:15 గంటలకు మాండ్ర శివానందరెడ్డి స్వగ్రామమైన అల్లూరుకు చేరుకున్నారు. అనంతరం మాండ్ర ఇంటికి వెళ్లి ఓ ల్యాండ్ (క్రైమ్ నంబర్ 194) కేసులో అరెస్టు చేయడానికి వచ్చామని చెప్పారు. దీంతో అరెస్టు వారెంట్‌తోపాటు కేసుకు సంబంధించిన కాగితాలు, రికార్డులను చూపాలని మాండ్ర కోరారు. అలాంటివి ఏమీ లేకుండా అరెస్టు చేయడానికి ఇంటిలోకి ఎలా వస్తారని వారిని నిలదీశారు. కేసుకు సంబంధించిన రికార్డులు, నోటీసులను చూపితే పూర్తిగా సహకరిస్తానని చెప్పారు. తాను కూడా ఒక సీనియర్ పోలీసు అధికారిని అని, చట్టం గురించి తెలుసునని చెప్పడంతో పోలీసులు ఏమీ చేయలేక వెనుదిరిగారు.

రాజకీయంగా దెబ్బతీసేందుకే..

రాజకీయంగా దెబ్బతీసేందుకే మాండ్రను అరెస్టు చేయాలని చూశారని మాండ్ర శివానందరెడ్డి సోదరుడు మాండ్ర సురేంద్రనాథ్ రెడ్డి అన్నారు. తెలంగాణ పోలీసులు తమ ఇంట్లోకి దౌర్జన్యంగా చొరబడి విచారణ పేరుతో భయభ్రాంతులకు గురి చేశారని తెలిపారు. దీంతో బ్రాహ్మణకొట్కూరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశామని చెప్పారు. ఇదే విషయంపై నందికొట్కూరు టీడీపీ అభ్యర్థి గిత్తా జయసూర్య స్పందిస్తూ నందికొట్కూరులో టీడీపీ గెలవకూడదనే వైసీపీ నాయకులు కుట్రలు చేస్తున్నారని అన్నారు. శ్రీనివాసరెడ్డి అనే వ్యక్తి తన స్వార్థం కోసం మాండ్రపై మచ్చ వేసేందుకు ప్రయత్నం చేస్తున్నాడని ఆరోపించారు.

'నాపై తప్పుడు ప్రచారం'



నందికొట్కూరు నియోజకవర్గంలో తనపై తప్పుడు ప్రచారం జరుగుతోందని, తెలంగాణ పోలీసులు నోటీసులు ఇస్తే తప్పకుండా సహకరిస్తామని మాండ్ర శివానందరెడ్డి ఓ వీడియో ద్వారా తెలిపారు. హైదరాబాదు పోలీసులు తన ఇంటికి వచ్చింది వాస్తవమేనని, న్యాయవాదులు రంగారెడ్డి, సురేష్‌లు కేసుకు సంబంధించిన నోటీసులు, అరెస్టు వారెంటు లాంటి పేపర్లను అడిగారన్నారు. హైదరాబాదుకు వస్తే పేపర్లు ఇస్తామని పోలీసులు చెప్పారని, దీంతో తాను తెలంగాణ పోలీసులకు సహకరించలేదని వివరించారు. తనకు సంబంధంలేని నేరస్థులుగా భావించి విచారణ పేరుతో హైదరాబాదుకు తరలిస్తామంటే ఒప్పుకోమని చెప్పారు. 91 నోటీసులు ఇస్తే పోలీసులకు తప్పకుండా సహకరిస్తామని మాండ్ర స్పష్టం చేశారు.

మాకు ఎలాంటి సమాచారం లేదు

తెలంగాణ పోలీసులు మాకు ఎలాంటి ముందస్తు సమాచారం ఇవ్వలేదు. మాండ్ర శివానందరెడ్డి విచారణకు సహకరించడం లేదని, బందోబస్తు కావాలని తెలంగాణ పోలీసులు కోరారు. దీంతో మేము పోలీసు సిబ్బందిని పంపాం. ఏ కేసులో అరెస్టు చేసేందుకు వచ్చారో కూడా మాకు తెలియదు.

-విజయభాస్కర్,
నందికొట్కూరు రూరల్ సీఐ

ఐపీఎల్ బెట్టింగ్ నిర్వాహకుడి అరెస్టు

రూ.3 లక్షల నగదు, రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం

ఆదోని, ఏప్రిల్ 1: ఐపీఎల్ క్రికెట్ బెట్టింగ్ నిర్వహిస్తున్న వ్యక్తిని ఆదోని పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. నిందితుడి నుంచి భారీగా నగదును స్వాధీనం చేసుకున్నారు. సోమవారం టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కేసు వివరాలను డీఎస్పీ శివనారాయణ స్వామి వెల్లడించారు. ఆదోని మండలం ధణాపురం గ్రామం వెళ్లే రహదారిలోని పాతబడిన ఇందిరమ్మ ఇళ్లలో బెట్టింగ్ నిర్వహిస్తున్న ఆదోనిలోని బోయగేరి కాలనీకి చెందిన అంజనేయులు అలియాస్ కుంటి అంజి ముంబై ఇండియన్స్-రాజస్థాన్ జట్ల మధ్య జరుగుతున్న క్రికెట్‌పై బెట్టింగ్ నిర్వహిస్తున్నాడు. పోలీసులకు సమాచారం అందడంతో దాడి చేసి, నిందితుడిని అదుపులో తీసుకున్నారు. అతని వద్ద నుండి రూ.3 లక్షల నగదుతో పాటు రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి అతడ్ని రిమాండ్‌కు తరలించారు.

పసుపు అధరహో ● 250 కేజీలు రూ.6వేలు



రుద్రవరం, ఏప్రిల్ 1: పసుపునకు మంచి ధర లభిస్తోంది. పుట్టి (250 కేజీలు) పసుపు కొమ్ములు రూ.6వేలు పలుకుతున్నాయి. గత ఏడాది పుట్టి పసుపు రూ.1500 నుంచి రూ.1600 పలికింది. 20 ఏళ్ల తరువాత తొలిసారిగా పసుపునకు మంచి ధర వచ్చిందని రైతులు హర్షం వ్యక్తం చేశారు. 700 ఎకరాల్లో పసుపు పంటను రైతులు సాగు చేశారు. ఒక్కసారిగా పుట్టిపై రూ.4500 అదనంగా రేటు పలికింది.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



మృతుని కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న కోట్ల సుజాతమ్మ

డోన్ (రూరల్), ఏప్రిల్ 1: డోన్ మండలం గోసానిపల్లె గ్రామ సమీపంలో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన సంఘటన చోటు చేసుకుంది. ప్యాపిలి మండలం ఊటకొండ గ్రామానికి చెందిన వెంకటేశ్వరరావు (50) తన ఆటోలో డోన్ నుంచి సిమెంటు సంచులు వేసుకుని ఊటకొండకు వెళ్తున్న ఎదురుగా వస్తున్న కారు ఢీకొనడంతో ఆటోలో ఉన్న వెంకటేశ్వరరావు తీవ్ర గాయాలకు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతునికి ఒక భార్య, కూతురు, కొడుకు ఉన్నారు.

పరామర్శించిన కోట్ల సుజాతమ్మ

ప్రమాదం జరిగిన సంఘటన స్థలంలో డోన్ మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ ఆగి మృతుడి బంధువులను పరామర్శించారు. మృతుని కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఈ సంఘటనపై రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

'సీఎం జగన్ నిర్ణయంతో ఖజానా ఖాళీ'



మాట్లాడుతున్న మల్లెల రాజశేఖర్

ఓర్వకల్లు, ఏప్రిల్ 1: ప్రతి నెలా 1వ తేదీన పంపిణీ చేయాల్సిన సామాజిక పింఛన్ల మొత్తాన్ని సీఎం జగన్ రెడ్డి తన సొంత కాంట్రాక్టర్లకు ఇవ్వడంతో ఖజానా ఖాళీ అయిందని నంద్యాల టీడీపీ అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్ అన్నారు. సోమవారం హుసేనాపురంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పింఛన్ల సొమ్మును సీఎం జగన్ వైసీపీ కాంట్రాక్టర్లకు ఇచ్చారని, దీంతో వృద్ధులు, వితంతులు, వికలాంగులకు పింఛన్ పంపిణీ చేయడం లేదని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. పింఛన్లపై వైసీపీ నాయకులు తప్పుడు ప్రచారాలు చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో నాయకులు ఎస్.మహబూబ్‌బాషా, కేవీ మధు, వలి, వేణు, బజారు తదితరులు పాల్గొన్నారు.

నంద్యాల

నంద్యాల, నందికొట్కూరు, శ్రీశైలం, పాణ్యం

ఎన్నికల విధుల నుంచి మినహాయింపు ఇవ్వాలి: ఎస్టీయూ



డీఆర్వోకు వినతిపత్రం అందజేస్తున్న ఎస్టీయూ నాయకులు

నంద్యాల (నూనెపల్లె), ఏప్రిల్ 1: దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న ఉపాధ్యాయులకు ఎన్నికల విధుల నుంచి మినహాయింపు ఇవ్వాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మౌళాలి, ఆజామ్‌బేగ్ డిమాండ్ చేశారు. సోమవారం నంద్యాలలోని డీఆర్వో పద్మజకు ఎస్టీయూ నాయకులు వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం దీర్ఘకాలికల వ్యాధులతో బాధపడే ఉపాధ్యాయులకు, బాలింతలు, గర్భిణులు, పదవీ విరమణ సమీపంలో ఉన్న వారికి, ప్రమాదాలలో గాయపడి శస్త్ర చికిత్సలు చేయించుకున్న వారికి మినహాయింపు ఇవ్వాలని కోరారు. నాయకులు శ్రీనివాసరావు, ప్రసాద్, తదితరులు ఉన్నారు.

పాదయాత్రికులకు అన్నదానం

పాములపాడు, ఏప్రిల్ 1: ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని శ్రీశైలం పాదయాత్రగా వెళ్తున్న కన్నడ భక్తులకు అన్నదానం నిర్వహించారు. మండలంలోని జూటూరు గ్రామంలో కేజీ రోడ్డుపై గల నాగసాయి విద్యా బ్రహ్మ ఆశ్రమం పీఠాధిపతి రామనంద స్వాములు ఆధ్వర్యంలో సోమవారం అన్నదాన కార్యక్రమం ప్రారంభించారు. రామనంద స్వాములు మాట్లాడుతూ ప్రతి ఏడాది శ్రీశైలం పాదయాత్ర వెళ్లే శివరాత్రి శివస్వాములకు, ఉగాది పండుగకు కర్ణాటక, మహారాష్ట్ర నుంచి పాదయాత్ర చేసే కన్నడ భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

భక్తుడికి బంగారు ఉంగరం అప్పగింత

మహానంది, ఏప్రిల్ 1: మహానంది క్షేత్రంలో కోనేరులో పుణ్యస్నానాలు చేస్తున్న సమయంలో జారవిడుచుకొన్న బంగారు ఉంగరాన్ని భక్తుడికి ఆలయ ఈవో కాపు చంద్రశేఖర్‌రెడ్డి చేతుల మీదుగా అప్పగించారు. సోమవారం ప్రకాశం జిల్లా గిద్దలూరుకు చెందిన శివకుమార్ అనే భక్తుడు మహానంది కి వచ్చారు. కోనేరులో పుణ్య స్నానాలు చేస్తుండగా ఉంగరం జారి నీటిలో పడిపోయింది. విషయాన్ని గమనించిన భక్తుడు పరిసరాల్లో విధులు నిర్వహిస్తున్న హోంగార్డు బాలుడు దృష్టికి తెచ్చాడు. ఈవో ఆదేశాల మేరకు స్థానిక చెంచు వ్యక్తులతో కోనేరులో వెతికించాడు. ఉంగరం దొరకడంతో ఈవో చేతుల మీదుగా భక్తుడికి అప్పగించారు.

శ్రీశైలం ఈఈ పూజలు

నంద్యాల, ఏప్రిల్ 1: మహానంది క్షేత్రంలో శ్రీశైల దేవస్థానం ఈఈ రామకృష్ణ, డీఈఈ సుబ్బారెడ్డి సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. వీరికి ఆలయం ముఖద్వారం వద్ద దేవస్థానం ఇంజనీరింగ్ అధికారి శ్రీనివాసులు యాదవ్ ఆధ్వర్యంలో అర్చకులు స్వాగతం పలికారు. అనంతరం ప్రధాన ఆలయాల్లో స్వామి, అమ్మవార్లకు అభిషేకార్చనలు జరిపారు. అలంకార మంటపంలో వేదపండితులు వీరిని శాలువాతో సన్మానించి ప్రసాదాలు అందచేసారు. వీరి వెంట శ్రీశైలం ఎలక్ట్రీషియన్ చిన్న వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఆర్జీఎంలో ముగిసిన క్రీడా పోటీలు

పాణ్యం, ఏప్రిల్ 1: మండలంలోని ఆర్జీఎం ఇంజనీరింగ్ కళాశాలలో గత నెల 30 వతేదీన ప్రారంభమైన ఆర్జీఎం ప్రీమియర్ లీగ్ క్రీడలు సోమవారం ముగిశాయి. ఈ క్రీడల్లో ఓవర ఆల్ చాంపియన్‌షిప్‌ను ఈసీఈ విభాగం కైవసం చేసుకున్నట్లు పీడీ వెంకటేశ్ తెలిపారు. పురుషుల కబడ్డీ, హ్యాండ్‌బాల్, ఫుట్‌బాల్, క్రికెట్‌య పోటీలలో ఈసీఈ విభాగం విన్నర్‌గా నిలిచిందన్నారు. వాలీబాల్ విన్నర్‌గా సీఎస్ఈ విభాగం నిలిచిందన్నారు. మహిళా క్రికెట్, త్రోబాల్, బాస్కెట్ బాల్ పోటీలలో సీఎస్ఈ విభాగం విన్నర్‌గా నిలిచిందని చెప్పారు. టెన్నికాయిట్‌లో డేటా సైన్స్ విన్నర్‌గా నిలిచిందన్నారు. విజేతలకు కళాశాల ఛైర్మన్ డాక్టర్ మిద్దె శాంతిరాముడు. కప్పును, మెమెంటోలను అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ జయచంద్రప్రసాద్, సుధీర్‌కుమార్, వెంకటేశ్వర్లు, పీఈటీలు, పాల్గొన్నారు.

మాన్యం వేలంలో రూ.5.60 లక్షల ఆదాయం



వేలం పాట నిర్వహిస్తున్న దేవదాయశాఖ అధికారులు

కొత్తపల్లి, ఏప్రిల్ 1: కొత్తపల్లిలోని తాండవ మల్లేశ్వరస్వామి, అంజనేయస్వామి ఆలయాలకు చెందిన మాన్యం భూములను కౌలుకు నిర్వహించిన వేలం పాటల్లో రూ.5.60 లక్షల ఆదాయం లభించినట్లు ఆలయ ఈవో కార్తీక్ తెలిపారు. సోమవారం స్థానిక తాండవ మల్లేశ్వరస్వామి ఆలయ ఆవరణలో ఉభయ దేవాలయాలకు చెందిన 58 ఎకరాల భూములను ఒక ఏడాది పాటు రైతులకు కౌలుకు వేలం పాట నిర్వహించినట్లు చెప్పారు. గత ఏడాది ఇదే భూములకు వేలం నిర్వహించగా.. రూ.3.83 లక్షల ఆదాయం మాత్రమే లభించగా.. ఈ ఏడాది అదనంగా రూ.1.77 లక్షల అదనపు ఆదాయం వచ్చినట్లు తెలిపారు. వచ్చిన ఆదాయాన్ని దేవదాయ శాఖ ఖాతాలో జమ చేస్తున్నట్లు ఈవో తెలిపారు. దేవదాయశాఖ అధికారులు, సిబ్బంది, కౌలు రైతులు, ప్రజలు పాల్గొన్నారు.

మద్యం మత్తులో ఘర్షణ.. ఒకరి మృతి

గోస్పాడు, ఏప్రిల్ 1: మండలంలోని జూలేపల్లె గ్రామంలో ఆదివారం మద్యం మత్తులో ఇద్దరు ఘర్షణ పడి ఒకరు కత్తిపోట్లకు గురయ్యారు. గోస్పాడుకు చెందిన వెంకటేశ్వర్లు, జూలేపల్లెకు చెందిన దొరకొండ సుదర్శన్ (35) ఘర్షణ పడ్డారు. వెంకటేశ్వర్లు సుదర్శన్‌పై కత్తితో దాడి చేశాడు. కుటుంబ సభ్యులు నంద్యాల ప్రభుత్వాసుపత్రికి తీసుకురాగా మెరుగైన చికిత్స కోసం కర్నూలు ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లారు. కోలుకోలేక సుదర్శన్ సోమవారం మృతిచెందారు. కేసు నమోదు చేసుకొని విచారణ చేపట్టినట్లు ఎస్ఐ నాగార్జునరెడ్డి తెలిపారు.

టీడీపీలోకి వలసలను ఆపుకునేందుకు ఆపసోపాలు?

● వాళ్లందరూ వైసీపీ వాళ్లు కాదని చిత్రీకరించే యత్నం

ఆత్మకూరు, ఏప్రిల్ 1: టీడీపీలోకి వలసలను ఆపుకొనేందుకు ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి ఆపసోపాలు పడుతున్నట్లు తెలుస్తోంది. ఈక్రమంలో తమ పార్టీ కన్నా.. టీడీపీ చేరికలపైనే ఆయన ఎక్కువగా ఆలోచిస్తున్నట్లు కనిపిస్తోంది. ఇందిరేశ్వరం గ్రామంలో ఆదివారం రాత్రి వైసీపీ నుంచి టీడీపీలోకి భారీగా చేరికలు జరిగాయి. సుమారు 800 మంది వరకు తరలివచ్చారు. అక్కడ ఏర్పాటు చేసిన సభలో మాజీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి సమక్షంలో జనం ఉత్సాహంగా టీడీపీలో చేరారు. దీంతో వైసీపీ నాయకులు సోమవారం విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేసి విమర్శలు చేశారు. టీడీపీలోకి చేరిన వారందరూ వైసీపీ వాళ్లు కాదని చెప్పే ప్రయత్నం చేశారు. వాస్తవానికి ఇందిరేశ్వరంలో జరిగిన సభలో వివిధ సామాజిక వర్గాల వారు గ్రూపులుగా టీడీపీలోకి చేరారు. ఆతర్వాత వేదికపై మాజీ ఎమ్మెల్యే బుడ్డాతో సహా గ్రామానికి చెందిన సీనియర్ నాయకులతో కలిసి టీడీపీలోకి చేరిన వారు గ్రూప్ ఫోటోలు దిగారు. వాటిలో మాజీ ఎమ్మెల్యే బుడ్డాతో పాటు గ్రామ నాయకులతో పార్టీలోకి చేరిన వారు దిగిన ఓ ఫోటోను చూపిస్తూ టీడీపీ నాయకులే టీడీపీలోకి చేరారని ఎమ్మెల్యే శిల్పా ఆరోపణలు చేయడంపై టీడీపీ శ్రేణులు మండిపడుతున్నారు. టీడీపీలోకి చేరికలను చూసి జీర్ణించుకోలేకే ప్రజల మైండ్‌ను డైవర్ట్ చేసేందుకే ఎమ్మెల్యే శిల్పా ఇలాంటి ఆరోపణలు చేస్తున్నారని వారు పేర్కొంటున్నారు. టీడీపీ చేరికల సభలకు వస్తే వాస్తవాలు తెలుస్తాయని వారిని ఆహ్వానిస్తున్నారు.

వైభవంగా సహస్ర దీపాలంకరణ సేవ





సహస్ర దీపాలంకరణ సేవ నిర్వహిస్తున్న అర్చకుడు, రథోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు, అధికారులు, సిబ్బంది

శ్రీశైలం, ఏప్రిల్ 1: శ్రీశైల క్షేత్రంలో సోమవారాన్ని పురస్కరించు కొని భ్రమరాంబ మల్లికార్జున స్వామి, అమ్మ వార్లకు సాయంత్రం సహస్ర దీపాలంకరణ సేవను దేవస్థానం వైభవంగా నిర్వహించింది. ముందుగా స్వామి, అమ్మవార్ల ఉత్సవ మూర్తులను పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించి వేదికపై ఆశీనులను చేశారు. అనంతరం అర్చకులు వేదమంత్రోచ్చారణలతో పూజలు చేశారు. అనంతరం సహస్ర దీపాలంకరణ సేవను నిర్వహించారు. తరువాత స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను వెండి రథంపై ఆశీనులనుజేసి ప్రత్యేక పూజలు, మంగళ హారతులు జరిపి ఆలయ ప్రాంగణంలో రథోత్సవాన్ని నిర్వహించారు. ఆలయ అధికారులు, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

మహానందిలో పంచాంగ పుస్తకం ఆవిష్కరణ



పంచాంగ పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఆలయ ఈవో

నంద్యాల, ఏప్రిల్ 1: మహానందిలో శాస్త్రీయ నూతన తెలుగు సంవత్సరం పురష్కరించుకొని మహానంది దేవస్థానం సిద్ధాంత పంచాగం పుస్తకాలను సోమవారం ఆలయ ఈవో కాపు చంద్రశేఖర్‌రెడ్డి చేతుల మీదుగా వేదపండితులు ఆవిష్కరించారు. ముందుగా ప్రధాన ఆలయాల్లో అర్చకులు పంచాంగం పుస్తకాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పుస్తకావిష్కరణ చేశారు. ఇందులో తెలుగు సంవత్సరం పురష్కరించుకొని తిథి, వార, నక్షత్ర, యోగ, కరుణాల గణనతోపాటు వివరాలతో పాటు అనేక వాస్తు, ముహూర్త విషయాలను తిరుమల తిరుపతి దేవస్థానం ఆస్థాన సిద్ధాంతి తంగిరాల వెంకటకృష్ణ ప్రపూర చేత రచించగా ఆలయ వేదపండితులు రవిశంకర్ అవధాని పండుగలు, పర్వదినాలు, వారోత్సవాలను రచించినట్లు ఈవో పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏఈవోలు ఎర్రమల్ల మధు, వెంకటేశ్వర్లు, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ నాగభూషణం, సిబ్బంది పాల్గొన్నారు.

'ఇంటి వద్దనే పింఛన్ అందజేయాలి'

బండిఆత్మకూరు, ఏప్రిల్ 1: లబ్ధిదారులకు ఇంటి వద్దనే పింఛన్ అందజేయాలని టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు కంచర్ల సురేష్‌రెడ్డి, శ్రీశైలం ట్రస్టు బోర్డు మాజీ సభ్యుడు డాక్టర్ చిట్టిబొట్ల భరద్వాజశర్మ, యూనిట్ ఇన్‌చార్జి తాటికొండ బుగ్గరాముడు కోరారు. సోమవారం వారు మాట్లాడుతూ పింఛన్ పంపిణీ గురించి సామాజిక మాధ్యమంలో రాజకీయం చేయటం వైసీపీకి తగదన్నారు. వలంటీర్లు గ్రామాల్లో రాజకీయాలు చేస్తారని కేంద్ర ఎన్నికల సంఘం ప్రభుత్వ ఉద్యోగుల ద్వారా అందజేయాలని ప్రభుత్వాన్ని ఆదేశించిందన్నారు. దీన్ని టీడీపీకి ఆపాదించి ఓట్లు పొందాలనుకోవటం వైసీపీ దుర్మార్గ చర్య అన్నారు. గ్రామాల్లో సచివాలయ సిబ్బంది పది మందికి పైగానే ఉన్నారని, వారి చేత పంపిణీ చేయిస్తే కేవలం ఒకే రోజులో పంపిణీ పూర్తి చేయవచ్చని అన్నారు. లబ్ధిదారులను ఎండకు సచివాలయాల వద్దకు రప్పించవద్దని వారు కోరారు.

'తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు'

ఆత్మకూరు రూరల్, ఏప్రిల్ 1: ఆత్మకూరు మండలంలోని ఆయా గ్రామాల్లో నెలకొన్న తాగునీటి ఎద్దడికి నివారణ చర్యలు చేపడుతున్నట్లు ఈవోఆర్డీ మోహన్‌కుమార్ తెలిపారు. సోమవారం మండలంలోని కొట్టాల చెరువు గూడెంలో తలెత్తిన తాగునీటి ఎద్దడి నివారణ కోసం సర్పంచ్ నాగలక్ష్మితో ప్రత్యామ్నాయ మార్గాల కోసం పరిశీలించారు. గ్రామంలోని ఎస్టీ కాలనీలో కొక్కరంచ వాటర్ స్కీం నుంచి అరకొర నీరు సరఫరా అవుతుండటంతో తాగునీటి ఎద్దడి నెలకొందని గ్రామస్థులు అధికారులను కోరడంతో గ్రామంలోని బోర్లను పరిశీలించారు. ఎస్టీ కాలనీలో తాగునీటిని అందించే బోర్లు మరమ్మతులకు గురి కావడంతో ఆ బోర్లను రిపేరు చేయించడంతో పాటు మొరాయిస్తున్న మోటర్లకు మరమ్మతులు చేయించినట్లు తెలిపారు. అలాగే ప్రత్యామ్నాయ చర్యల్లో భాగంగా అన్ని గ్రామాల్లో మరమ్మతులకు గురైన బోర్లను పరిశీలించనున్నట్లు తెలిపారు. గ్రామాల్లో నెలకొన్న తాగునీటి ఎద్దడి నివారించేందుకు సత్వర చర్యలు చేపడుతున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ప్రహ్లాదుడు పాల్గొన్నారు.

వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభం



వార్షికోత్సవాలకు అంకురారోపణ చేస్తున్న దృశ్యం

ఆత్మకూరు, ఏప్రిల్ 1: ఆత్మకూరు పట్టణంలో వెలసిన వేంకటేశ్వరుడి ఆలయ ద్విపుష్కర(24) వార్షిక బ్రహ్మోత్సవాలు సోమవారం సాయంత్రం వైభవంగా ప్రారంభయ్యాయి. ఆలయ నిర్మాణం జరిగి 24ఏళ్ల పూర్తయిన శుభ సందర్భంగా ఈ వేడుకలను దేవస్థానం ప్రధాన అర్చకులు దేవరపల్లి అనిల్‌కుమార్ సమక్షంలో శాస్త్రోక్తంగా అంకురార్పణ చేశారు. ఈ వేడుకల్లో తొలి రోజు స్వామివారికి సుప్రభాత సేవా, ప్రాతఃమారాధన సేవాకాల నివే దన చేపట్టారు. అదేవిధంగా స్వామివారికి ఆభరణాలతో ప్రత్యేక అలంక రించారు. సాయంత్రం ఆరాధన, పారాయణ, గోపూజ, విశ్వక్సేనారాధన, పుణ్యాహం, రక్షాబంధన క్రతువులను నిర్వహించి అంకురారోపణకు నాందిప లికారు. ఆరురోజుల పాటు జరిగే ఈ వేడుకల్లో ప్రతిరోజు స్వామివారికి వివిధ పూజా కైంకర్యాలను జరుపనున్నారు. ఇందులో భాగంగా 2న సంతానార్థుల కోసం గరుడప్రసాద కార్యక్రమం, 3వ తేదిన లక్ష్మీఅమ్మవారికి అభిషేకం, అలంకరణతోపాటు లక్ష్మీదేవీ అమ్మవారికి సామూహిక కుంకుమార్చన, వాహనోత్సవాలను జరపనున్నారు. అదేవిధంగా 4న గోదాదేవీ అమ్మవారికి అభిషేకం, అలంకరణ, గోదాదేవీ అమ్మవారికి సామూహిక కుంకుమార్చనలు గావించనున్నారు. అంతేకాకుండా 5వ తేదిన సాయంత్రం ఉత్సవమూర్తులకు లక్షపుష్పార్చన, వాహనోత్సవాలను నిర్వహించనున్నారు. కాగా చివరిరోజైన 6వ తేదీన వార్షికోత్సవ మహాపూర్ణాహుతితో వేడుకలకు ముగింపు పలకడమే కాకుండా విచ్చేసిన భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. అలాగే అదేరోజు సాయంత్రం 6.30గంటలకు స్వామి, అమ్మవార్లకు కల్యాణోత్సవాన్ని వేదపండితుల సమక్షంలో వైభవంగా నిర్వహించేలా ఏర్పాటు చేస్తున్నట్లు ఆలయ ప్రధాన అర్చకులు దేవరపల్లి అనిల్‌కుమార్ వెల్లడించారు.

బీజేపీ పార్లమెంట్ కో ఆర్డినేటర్‌గా మధు



పురంధేశ్వరికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న అభిరుచి మధు

నంద్యాల (కల్చరల్), ఏప్రిల్ 1: బీజేపీ నంద్యాల పార్లమెంట్ కో ఆర్డినేటర్‌గా అభిరుచి మధును ఎంపిక చేశారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి విజయవాడలో నంద్యాల జిల్లా పార్లమెంట్ కో ఆర్డినేటర్‌గా బాధ్యత అప్పగిస్తూ నియామక పత్రం అందించినట్లు అభిరుచి మధు తెలిపారు. ఈ సందర్భంగా అభిరుచి మధు పురందేశ్వరికి కృతజ్ఞతలు తెలిపారు.

టీడీపీతోనే బీసీలకు న్యాయం: మాండ్ర



జయహో బీసీ సదస్సులో మాట్లాడుతున్న మాండ్ర శివానంద రెడ్డి

మిడుతూరు, ఏప్రిల్ 1: టీడీపీతోనే బీసీలకు న్యాయం జరుగుతుందని టీడీపీ లోక్‌సభ నియోజకవర్గ ఇన్‌చార్జి మాండ్ర శివానందరెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని తలముడిపి గ్రామంలో మండల నాయకులు కాతా రమేష్ రెడ్డి, గుండం రమణారెడ్డి ఆధ్వర్యంలో జయహో బీసీ సదస్సు నిర్వహించారు. శివానందరెడ్డితో పాటు టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గిత్తా జయసూర్య, మాండ్ర లింగారెడ్డి హాజరై మాట్లాడారు. 74 మంది బీసీలను హత్యలు చేసిన ఘనత వైసీపీకే దక్కుతుందన్నారు. వైసీపీ ప్రభుత్వం 10 రూపాయలు ఇచ్చి వంద రూపాయలు లాక్కొని బటన్ నొక్కుడు కార్యక్రమం తప్ప ఈరోజు గ్రామాల్లో లైట్లు, రోడ్లు వేసుకోలేని పరిస్థితి నెలకొన్నదని విమర్శించారు. టీడీపీ ప్రభుత్వం వస్తే బీసీలకు పెద్ద పీటవేసి రక్షణ చట్టాన్ని తెచ్చి వారికి అండగా ఉంటుందన్నారు. తలముడిపి గ్రామం పక్కన ఉన్న అలగనూరు రిజర్వాయర్ కుంగి మూడు ఏళ్లు కావస్తున్నా దానిని రిపేరు చేసే ఆలోచన వైసీపీ ప్రభుత్వానికి లేదని విమర్శించారు. టీడీపీ ప్రభుత్వం వస్తే అలగనూరు రిజర్వాయర్‌ను పూర్తిగా రిపేరు చేసి రైతుకు మత్స్యకారులకు న్యాయం చేస్తానని చంద్రబాబు హామీ ఇచ్చారని మాండ్ర అన్నారు. కార్యక్రమంలో నాయకులు వంగాల శిరామిరెడ్డి, స్వామి రెడ్డి, రవి, ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

రూ.50 వేలు మించి నగదు తీసుకెళ్తే ఆధారాలు తప్పనిసరి: కలెక్టర్



కార్యక్రమంలో పాల్గొన్న వ్యాపారులు

నంద్యాల (కల్చరల్), ఏప్రిల్ 1: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమల్లో ఉన్న సమయంలో 50వేల రూపాయలకు మించి నగదు తీసుకెళ్తే సంబంధిత రశీదు, ఆధారాలు తప్పనిసరిగా ఉండాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డా.కె. శ్రీనివాసులు చెప్పారు. ఇందుకు వ్యాపార సంఘాలు, ట్రేడ్ యూనియన్లు సహకరించాలని కోరారు. నగదుకుకు సంబంధించిన బిల్లులు, రిసిప్ట్ ఓచర్లు, పేమెంట్ ఓచర్లు సంబంధిత వివరాలన్నీ ఉండాలన్నారు. సోమవారం కలెక్టరేట్లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్లో జిల్లాలోని వ్యాపార సంఘాలు, ట్రేడ్ యూనియన్లతో సమావేశం నిర్వహించారు. ఎస్పీ రఘువీర్ రెడ్డి, జాయింట్ కలెక్టర్ రాహుల్‌కుమార్ రెడ్డి, డీఆర్వో పద్మజ తదితరులు పాల్గొన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ మాట్లాడుతూ ఎన్నికల ప్రవర్తణ నియమావళిలో భాగంగా 29 రకాల వస్తువులు అధిక సంఖ్యలో కొనుగోలు చేసి డిస్ట్రిబ్యూషన్ జరిగితే సంబంధిత వస్తువులు సీజ్ చేస్తామని కలెక్టర్ హెచ్చరించారు. సరుకు రవాణా చేస్తే ట్యాక్స్ ఇన్వాయిస్, వ్యాలిడ్ ఈ వేబిల్ ఉండాలన్నారు. ఈ అంశానికి సంబంధించి ఐటీ, జీఎస్టీ, పోలీస్, ఎక్సైజ్ తదితర 22 ఎన్ఫోర్సుమెంట్ ఏజెన్సీలు నిరంతరం పనిచేస్తున్నాయని కలెక్టర్ వివరించారు. బ్యాంకు ఖాతాల ద్వారా అనుమానాస్పద, అధిక మొత్తంలో జరిగే లావాదేవీల వివరాలు ఎప్పటికప్పుడు ఆదాయపు పన్ను శాఖకు అందజేయాలన్నారు.

ఉగాది ఉత్సవాల్లో నిబంధనలు పాటించాలి: జేసీ

నంద్యాల (కల్చరల్), ఏప్రిల్ 1: ఉగాది పండుగ సందర్భాన్ని పురష్కరించుకొని గ్రామ పరిధిలోని దేవాలయాల్లో జరిగే ఉగాది ఉత్సవాల్లో ఎలాంటి రాజకీయ ఉపన్యాసాలు, కార్యక్రమాలు నిర్వహించకుండా ఎన్నికల నిబంధనలు పాటించేలా చర్యలు తీసుకోవాలని జాయింట్ కలెక్టర్ రాహుల్‌కుమార్ రెడ్డి దేవాదాయ శాఖ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో ఉగాది ఉత్సవాలలో తీసుకొనే ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించారు. జిల్లా ఎస్పీ రఘువీర్‌రెడ్డి, డీఆర్వో పద్మజ, నందవరం దేవస్థానం ఈవో కామేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

'పింఛన్ల పంపిణీపై మార్గదర్శకాలు ఇస్తాం'

నంద్యాల (కల్చరల్), ఏప్రిల్ 1: రాష్ట్రంలో వివిధ పింఛన్ల పంపిణీకి సంబంధించి వెంటనే సవరించిన మార్గదర్శకాలను జారీ చేస్తామని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డా. కేఎస్ జవహర్ రెడ్డి చెప్పారు. సోమవారం వెలగపూడి రాష్ట్ర సచివాలయం నుంచి ఫించన్లు పంపిణీ, వడగాల్పులపై తీసుకోవాల్సిన జాగ్రత్త చర్యలు, తాగునీరు, ఉపాధిహామి పనులు, విద్యుత్ సరఫరా పరిస్థితులు తదితర అంశాలపై ఆయన జిల్లా కలెక్టర్లతో వీడియో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ చాంబర్‌లో కలెక్టర్ డా.కె.శ్రీనివాసులు, సంబంధిత అధికారులు సీఎస్ వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు.

వ్యాధుల బారిన ప్రజలు



నంద్యాలలోని ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న పిల్లలు

బండిఆత్మకూరు, ఏప్రిల్ 1: మండలంలోని వెంగళరెడ్డిపేట గ్రామంలో విష జ్వరాలు ప్రబలాయి. దీంతో రోజు నంద్యాల ప్రైవేటు ఆసుపత్రులకు జనం పరుగులు తీస్తున్నారు. గ్రామానికి చెందిన మహేష్, మౌనిక, మధు, లక్ష్మి, సుమంత్‌తో పాటు మరి కొంత మంది ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారు. నాలుగు రోజులుగా గ్రామంలో కొంత మందికి జ్వరాలు సోకాయి. వాంతులు, విరోచనాలు అవుతండటం, జ్వరం తగ్గక పోవటంతో భయంతో నంద్యాలకు తరలివెళ్తున్నారు. అక్కడ పలు ఆసుపత్రుల్లో పరీక్షలు చేసిన వైద్యులు కణాలు తక్కువగా ఉన్నాయని పేర్కొన్నారని గ్రామస్థులు చెబుతున్నారు. దీంతో తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు. వెంటనే స్థానిక వైద్యాధికారులు గ్రామంలో పర్యటించి జ్వరాల అదుపునకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

శిల్పా అసమర్థతతోనే నీటి కష్టాలు: బుడ్డా



టీడీపీలో చేరిన నాయకులతో మాజీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి

ఆత్మకూరు, ఏప్రిల్ 1: శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి అసమర్థత వల్లే ఆత్మకూరు ప్రాంతంలో నీటి కష్టాలు తలెత్తాయని శ్రీశైలం మాజీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి ధ్వజమెత్తారు. సోమవారం మండలంలోని ముష్టేపల్లి గ్రామంలో మాజీ ఎమ్మెల్యే బుడ్డా సమక్షంలో పలు కుటుంబాలు వైసీపీని వీడి టీడీపీలోకి చేరాయి. బుడ్డా మాట్లాడుతూ టీడీపీ హయాంలో ఎంతో కష్టపడి సిద్దాపురం ఎత్తిపోతల పథకాన్ని పూర్తి చేస్తే.. ఐదేళ్ల వైసీపీ పాలనలో కనీసం పంట కాలువను కూడా ఏర్పాటు చేయకుండా సిద్దాపురం ఎత్తిపోతలను నాశనం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. వెలుగోడు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ ద్వారా సిద్దాపురం చెరువుకు సకాలంలో నీరు నింపి ఉంటే నేడు మండలంలో సాగు, తాగునీటి కష్టాలు వచ్చేవి కావని అన్నారు. ఎమ్మెల్యే శిల్పాకు ఈ ప్రాంత సమస్యలపై అవగాహనే లేదన్నారు. తాను స్థానికుడినని, ఇక్కడి ప్రజల కష్టాలేంటో తనకు తెలసని చెప్పారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీని గెలిపిస్తే ముష్టేపల్లి గ్రామాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం అక్కడి మహిళలతో మాట్లాడి వైసీపీ దోపిడీ పథకాల గురించి ఆరా తీశారు. మహిళలు సైతం వైసీపీ పాలనలో తమకు జరిగిన అన్యాయాలను వివరించారు. అంతకుముందు మాజీ ఎమ్మెల్యే బుడ్డా గ్రామస్థులు ఆత్మీయ స్వాగతం పలికారు. టీడీపీ మండల, పట్టణాధ్యక్షులు శివప్రసాద్‌రెడ్డి, వేణుగోపాల్, నాయకులు అబ్దుల్లాపురం బాషా, రాజారెడ్డి, మల్లికార్జునరెడ్డి, రామనర్సయ్య, వెంకట రాముడు, దినకర్, జనసేన, బీజేపీ నాయకులు శ్రీరాములు, విశ్వరూపాచారి ఉన్నారు.

వెలుగోడు: వచ్చే ఎన్నికల్లో టీడీపీదే అధికారమని మాజీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి అన్నారు. బండి ఆత్మకూరు మండలం పరమటూరు గ్రామానికి చెందిన వైసీపీ సీనియర్ నాయకులు నాగేశ్వరరెడ్డి, బొమ్మిరెడ్డి, మౌళాలి రెడ్డి నారాయణ, శ్రీనివాసులు ఆచారి నాగేశ్వరరావు, రమణా రెడ్డి, లక్ష్మి నాగ మద్దిలేటి సోమవారం టీడీపీ చేరారు. వారు సోమవారం బుడ్డా స్వగ్రామమైన వేల్పనూరు చేరుకుని బుడ్డా సమక్షంలో చేరారు. లాయర్ కృష్ణారెడ్డి, సాయిబాబా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ పాలనలో అభివృద్ధి శూన్యం: శబరి



వెలుగోడు జలాశయాన్ని సందర్శించిన బైరెడ్డి శబరి

వెలుగోడు, ఏప్రిల్ 1: వైసీపీ పాలనలో రాష్ట్రాభివృద్ధి శూన్యమని నంద్యాల పార్లమెంట్ టీడీపీ అభ్యర్థి బైరెడ్డి శబరి అన్నారు. సోమవారం ఆమె వెలుగోడు జలాశయాన్ని సందర్శించారు. అలాగే నంద్యాలలో తాగునీటిని అందించే పైప్‌లైన్ పనులను పరిశీలించారు. తాగునీటి పథకానికి సంబంధించిన పనులను పరిశీస్తున్న సందర్భంలో అక్కడ పనులను పర్యవేక్షిస్తున్న ఓ ఉద్యోగి ఇక్కడికి ఎవరిని అడిగి వచ్చారని శబరిని ప్రశ్నించారు. దీంతో ఆమె పనులను పరిశీలించడానికి, జలాశయాన్ని సందర్శించడానికి ఎమ్మెల్యే, ఎంపీల పర్మిషన్ కావాలా? అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇక్కడ ఏమి దాచి పెట్టడం లేదని, ఈ పనులను మడత పెట్టి జేబులో పెట్టుకోలేం కదా? అని ఆ చిరుద్యోగి దురుసు పదజాలంతో మాట్లాడారు. దీంతో శబరి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆమె మాట్లాడుతూ నంద్యాలకు సీఎం బస్సు యాత్రకు వచ్చి అన్ని బూటకపు మాటలు మాట్లాడారన్నారు. అమృత జల నీటి పథకం ద్వారా ప్రజలకు నీటి సరఫరా చేస్తున్నామని, వెలుగోడు నుంచి నంద్యాలకు పైప్‌లైన్ పూర్తి చేశామని నంద్యాల ఎంపీ పోచా బ్రహ్మానంద రెడ్డి బూటకపు మాటలు చెప్పారన్నారు. అయితే ఇక్కడ పనులు పూర్తి కాలేదని శబరి అన్నారు. బీజేపీ నాయకులు రాజశేఖరరెడ్డి, ప్రతాప్ ఆచారి, నూలు నాగేశ్వరరావు, మధు గౌడ్, లబ్బి మధు, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

నంద్యాల (కల్చరల్): అధికార పార్టీ వాళ్లకు కొమ్ముకాసి వారికి ఆర్థికంగా సహాయపడే వారిపై.. దొంగదారుల్లో డబ్బును తరలించే వారిపై చర్యలు తీసుకోవాలని టీడీపీ ఎంపీ అభ్యర్థి బైరెడ్డి శబరి అన్నారు. సోమవారం నంద్యాల కలెక్టరేట్ సమీపంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. డబ్బు తరలింపులో నిజమైన వ్యాపారులను ఇబ్బంది పెట్టవదని కోరారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

చంద్రబాబుతోనే బీసీల సంక్షేమం: గౌరు



టీడీపీలో చేరిన వైసీపీ నాయకులు

నందికొట్కూరు రూరల్, ఏప్రిల్ 1: చంద్రబాబుతోనే బీసీల సంక్షేమం సాధ్యమని టీడీపీ నందికొట్కూరు నియోజకవర్గ ఇన్‌చార్జి గౌరు వెంకటరెడ్డి అన్నారు. సోమవారం నందికొట్కూరు మండలంలోని బ్రాహ్మణకొట్కూరులో గౌరు వెంకటరెడ్డి నివాసంలో ముఖ్యకార్యకర్తల సమావేశం నిర్వహించారు. గౌరు మాట్లాడుతూ రాష్ట్రంలో వైసీపీ రాక్షస పాలన కొనసాగిస్తోందని ఆరోపించారు. గౌరు వెంకటరెడ్డి, టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి జయసూర్య సమక్షంలో పాములపాడు మండలంలోని మిట్టకందాల గ్రామ వైసీపీ నాయకులు టీడీపీలో చేరారు. వీరికి టీడీపీ కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. టీడీపీలో చేరిన వారు మద్దిలేటి, మహేష్, నాగన్న, శ్రీను, జమ్మన్న, రాజు, పుల్లయ్య తదితరులే ఉన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సీఎం జగన్‌పై చర్యలు తీసుకోవాలి: టీడీపీ



మాట్లాడుతున్న మల్లెల రాజశేఖర్, ఎన్ఎండీ ఫరూక్

నంద్యాల (నూనెపల్లె), ఏప్రిల్ 1: సీఎం జగన్‌మోహన్‌రెడ్డి, సీఎస్ జవహర్‌రెడ్డి, సెర్ప్ సీఈవో మురళీధర్‌రెడ్డిపై ఎలక్షన్ కమిషన్ చర్యలు తీసుకోవాలని టీడీపీ జిల్లా అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్ గౌడ్, టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు, నంద్యాల అసెంబ్లీ అభ్యర్థి ఎన్ఎండీ ఫరూక్ డిమాండ్ చేశారు. సోమవారం నంద్యాలలోని టీడీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ ఏప్రిల్ 1వ తేదీ నుంచి ఇంటి వద్ద పింఛన్లు పంపిణీ చేయాలని జగన్‌మోహన్‌రెడ్డి ఎందుకు ఆదేశాలు జారీ చేయలేదని ప్రశ్నించారు. రాష్ట్ర ఖజానాలో నిధులు లేకనే పింఛన్ల పంపిణీ కుంటు పడిందని ఆరోపించారు. స్వార్థ రాజకీయం వల్లే పింఛన్‌దారులు, వలంటీర్లు నష్టపోతున్నారని, టీడీపీ అధికారంలోకి రాగానే ఇంటి వద్దకే నెలకు రూ.4 వేలు పింఛన్ అందిస్తామని అన్నారు. 1.35 లక్షల మంది సచివాలయ సిబ్బంది, గ్రామ కార్యదర్శులు, ఇతర ప్రభుత్వ ఉద్యోగుల ద్వారా పింఛన్లను 1వ తేదీకే లబ్ధిదారుల ఇంటికి చేర్చేందుకు జగన్‌రెడ్డి ప్రభుత్వం యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పింఛన్ల పంపిణీ చేతకాక టీడీపీపై అసత్య ప్రచారాలు చేయడం సరికాదని అన్నారు.

వలంటీర్ల నుంచి ఫోన్లు స్వాధీనం చేసుకోండి



గ్రామ కార్యదర్శులతో మాట్లాడుతున్న ఎంపీడీవో రామచంద్ర

రుద్రవరం, ఏప్రిల్ 1 : మండలంలోని గ్రామ వలంటీర్ల నుంచి ఫోన్లు స్వాధీనం చేసుకోవాలని ఎంపీడీవో రామచంద్ర గ్రామ కార్యదర్శులను ఆదేశించారు. సోమవారం గ్రామ కార్యదర్శులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. పింఛన్ల పంపిణీ సచివాలయ ఉద్యోగులతో చేయించాలని గ్రామ కార్యదర్శులను ఆదేశించారు. ఎటువంటి పరిస్థితుల్లో గ్రామ వలంటీర్లతో పింఛన్ల పంపిణీ చేయించవద్దని ఎన్నికల సంఘం ఉత్తర్వులు ఉన్నాయన్నారు. పింఛన్ డబ్బులు 2వతేదీ గ్రామ కార్యదర్శులకు అందజేసి వారి నుంచి సచివాలయ ఉద్యోగులకు అందిస్తామన్నారు. కార్యక్రమంలో ఈవోపీఆర్‌డి శ్రీనివాసశర్మ, ఈవో వరలక్ష్మి తదితరులు ఉన్నారు.

ప్రభుత్వ మద్యం దుకాణంలో చోరీ

సంజామల, ఏప్రిల్ 1: నొస్సం గ్రామంలో ప్రభుత్వ మద్యం దుకాణంలో ఆదివారం రాత్రి చోరీ జరిగినట్లు ఎస్‌ఐ రమేష్ రెడ్డి సోమవారం తెలిపారు. ఆదివారం రాత్రి గుర్తు తెలియని దుండగులు ప్రభుత్వ మద్యం దుకాణంలో చోరీకి పాల్పడ్డారు. అయితే డబ్బులేమి తీసుకెళ్లలేదు. ఎస్‌ఐ చోరీపై ఆరా తీస్తున్నారు.

ఇరువర్గాలపై బైండోవర్

సంజామల, ఏప్రిల్ 1: అక్కంపల్లెలో ఇరువర్గాలను బైండోవర్ చేసినట్లు ఎస్‌ఐ రమేష్‌రెడ్డి సోమవారం తెలిపారు. వచ్చే ఎన్నికల్లో ఎలాంటి అల్లర్లు జరగకుండా ముందుగా బైండోవర్ చేశామన్నారు. వైసీపీకి చెందిన 9 మంది, టీడీపీకి చెందిన 9 మందిని పోలీస్ స్టేషన్‌కు పిలిచి కౌన్సెలింగ్ నిర్వహించి తహసీల్దారు ఎదుట హాజరుపరచామన్నారు. సొంత పూచీకత్తుపై వారిని విడుదల చేసినట్లు ఎస్‌ఐ వివరించారు.

దరఖాస్తుల గడువు పెంపు

డోన్(రూరల్), ఏప్రిల్ 1: ఏపీ మోడల్ స్కూల్‌లో 6వ తరగతి ప్రవేశానికి ఆన్‌లైన్‌లో దరఖాస్తు గడువు పెంచినట్లు ప్రిన్సిపాల్ జాస్మిన్ తెలిపారు. సోమ వారం తన కార్యాలయంలో ఆమె మాట్లాడూతూ ఈనెల 6వ తేదీ వరకు విద్యార్థులు 6వ తరగతి ప్రవేశానికి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. దర ఖాస్తు చేసుకున్న విద్యార్థులకు ఈ నెల 21న ప్రవేశ అర్హత పరీక్ష ఉదయం 10 నుంచి 12 గంటల వరకు ఉంటుందని తెలిపారు.

మాజీ ఎమ్మెల్యే బీసీతో బైరెడ్డి, కాటసాని భేటీ



బైరెడ్డి, కాటసాని చంద్రశేఖర్‌రెడ్డిలతో భేటీ అయిన మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్‌రెడ్డి

బనగానపల్లె, ఏప్రిల్ 1: బనగానపల్లె పట్టణంలోని బీసీ జనార్దన్ రెడ్డి స్వగృహంలో టీడీపీ నాయకుడు బైరెడ్డి రాజశేఖర్‌రెడ్డి, కాటసాని చంద్రశేఖర్‌రెడ్డి సోమవారం భేటీ అయ్యారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల కార్యాచరణలో భాగంగా టీడీపీ బలోపేతానికి తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. త్వరలో కాటసాని చంద్రశేఖర్‌రెడ్డి నారా చంద్ర బాబునాయుడు సమక్షంలో టీడీపీలో చేరనున్న సందర్భంగా ఈ భేటీ జరిగింది. బనగానపల్లె నియోజవర్గంలో టీడీపీని భారీ మెజార్టీతో గెలిపించడానికి తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బీసీ రాజారెడ్డి, బీసీ రామనాథరెడ్డి, కాట్రెడ్డి మల్లికార్జునరెడ్డి, వంగల పరమేశ్వ ర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అహోబిలం పీఠాధిపతికి టీటీడీలో సత్కారం

నంద్యాల, ఏప్రిల్ 1, ఆంధ్రజ్యోతి: అహోబిలం పీఠాధిపతి రంగనాథయతీంద్ర మహాదేశికన్‌ను టీటీడీ ఈవో ధర్మారెడ్డి, డిప్యూటీ ఈవో లోక్‌నాథం టీటీడీ శేషవస్త్రాలతో సత్కరించారు. పీఠాధిపతి సోమవారం టీటీడీని తన శిష్యబృందంతో సందర్శించారు. పీఠాధిపతిని ఈవో ధర్మారెడ్డి, డిప్యూటీ ఈవో లోక్‌నాథం ఇస్తికఫాల్‌తో స్వాగతం పలికారు. అనంతరం శఠారిని, పంచముద్రాత్మకంగా సమర్పించి, శేషవస్త్రం బహూకరించారు. 5న తిరుమలలో జరిగే అన్నమాచార్య వర్ధంతి మహోత్సవంలో పీఠాధిపతి ముఖ్యాధ్యక్షులుగా పాల్గొంటారు.

భక్తులు సూచనలు పాటించాలి

ఆళ్లగడ్డ, ఏప్రిల్ 1: అహోబిలం పావన నరసింహస్వామి క్షేత్రం టైగర్ల ప్రాంతంలో ఉన్నందున పర్యాటకులు, భక్తులు సూచనలు పాటించి క్షేత్రాన్ని దర్శించుకోవాలని అహోబిలం మఠం, ఫారెస్టు అధికారులు సోమవారం తెలిపారు. ఈ క్షేత్రానికి సోమవారం నుంచి గురువారం వరకు పర్యాటకులకు, భక్తులకు ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకే అనుమతి ఉంటుందని, శుక్ర, శని, ఆదివారాల్లో ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం గంటల వరకు అనుమతి ఉంటుందన్నారు. ప్రధానంగా క్షేత్రంలో జంతు బలులు ఇవ్వరాదని, రాత్రి వేళల్లో భక్తులు, పర్యాటకులు నిద్రించరాదని, ప్లాస్టిక్ వస్తువులు పూర్తిగా నిషేధమన్నారు. క్షేత్రానికి వెళ్లే వాహనదారులు నిర్ణయించిన రుసుమును చెల్లించి, నిర్దేశించిన సమయంలో తిరిగి రావాలని తెలిపారు. వన్యప్రాణులను రక్షించే బాధ్యత అందరిపై ఉంటుందని, అటవీకి నిప్పు పెట్టరాదని వారు తెలిపారు. పావన క్షేత్రంలో పులులు, ఎలుగుబంట్లు తదితర జంతువులు సంచరిస్తుంటాయని, పర్యాటకులు, భక్తులు జాగ్రత్తగా ఉండాలని సూచించారు.

వైసీపీ నుంచి టీడీపీలో చేరిక

బేతంచెర్ల, ఏప్రిల్ 1: బేతంచెర్ల పట్టణంలోని దుర్గాపేటకు చెందిన 40 కుటుంబాల వైసీపీ కార్యకర్తలు కోట్ల చిత్రమ్మ సమక్షంలో టీడీపీ కార్యాలయంలో సోమవారం టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. స్థానిక నాయకుడు టీడీపీ పట్టణ ఎస్సీ సెల్ అధ్యక్షులు గూటం శివ ఆధ్వర్యంలో వైసీపీకి చెందిన 40 కుటుంబాలు టీడీపీలో చేరాయి ఈ కార్యక్రమంలో పట్టణ టీడీపీ అధ్యక్షురాలు బుగ్గన ప్రసన్నలక్ష్మి, టీడీపీ సీనియర్ నాయకులు కోట్ల గిరిధర్ రెడ్డి, పార్టీలో చేరిన వైసీపీ కార్యకర్తలు బోగోలు శేఖర్, గజ్జి శ్రీదేవి, వరప్రసాద్ , గజ్జి నిఖిల్, గజ్జి గోపి, కె.నాగార్జున, కె.నాగేంద్ర వీరాంజనేయులు, శంకర్, గజ్జి మదు, రోహిత్ కుమార్, గజ్జి మధు కుమార్, సుమతి, గణ మద్దిలేటి, పురుషోత్తం,బీరెల్లి మహేంద్ర, కొణిదేటి నాగరాజ్, మల్లేశ్వరి, గోరుమానుకొండ నిర్మలమ్మ, మధుకుమార్, తదితరులు పార్టీలో చేరారు.

అఖిలప్రియపై కేసు నమోదు

ఉయ్యాలవాడ, ఏప్రిల్ 1 : ఆళ్లగడ్డ టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి భూమా అఖిలప్రియపై ఎన్నికల కోడ్ ఉల్లంఘన కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ రామాంజనేయరెడ్డి సోమవారం తెలిపారు. భూమా అఖిలప్రియ మార్చి 28న మండలంలో ర్యాలీ నిర్వహించేందుకు ఉదయం 10.30 నుండి సాయంత్రం 4.30 వరకు ఆర్వో అనుమతి తీసుకుని ఆ సమయంలో ర్యాలీ నిర్వహించకుడా అదే రోజు రాత్రి 8.30 నిమిషాలకు ర్యాలీ నిర్వహించి ఎన్నికల కోడ్ ఉల్లంఘించారని మండల ఎంసీసీ టీమ్ ఎంపీడీవో రఘురాం ఫిర్యాదు చేశారన్నారు. ఆయన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

ప్రజలు మార్పు కోరుకుంటున్నారు

మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్‌రెడ్డి



బీజేపీ నాయకులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే బీసీ

కోవెలకుంట్ల, ఏప్రిల్ 1: ప్రభుత్వంపై విసిరిగిపోయిన ప్రజలు మార్పును కోరుకుంటున్నారని మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్‌రెడ్డి కోరారు. సోమవారం కోవెలకుంట్లలో బీసీ మాట్లాడుతూ ఏపీలో రావాల్సిన నిధులు, జరగాల్సిన అభివృద్ధి కోసమే రాష్ట్రంలో మూడు పార్టీలు జతకట్టాయన్నారు. ప్రజల శ్రేయస్సును వారి భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకొని కూటమిని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. జగన్ అరాచక పాలన నుంచి రాష్ట్రాన్ని కాపాడేందుకు రాష్ట్రంలోని దుష్టశక్తులను ఓడించేందుకు కూటమితో ప్రజల్లోకి వస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో దళితులకు సరైన స్వేచ్ఛ లేదని అన్నారు. ప్రభుత్వ అక్రమాలను ప్రశ్నిస్తే దాడులు చేసి, కేసులు పెడుతున్నారన్నారు. గత 5 ఏళ్లలో దళితులపై 6వేల కేసులు పెట్టారన్నారు. సీఎం జగన్ ఏ ఒక్క ఘటనపై కూడా స్పందించలేదన్నారు. వైసీపీ ఎమ్మెల్సీ దళితుడ్ని చంపి అతని మృతదేహాన్ని డోర్ డెలివరీ చేసినప్పుడు ఈసిగ్గులేని జగన్ స్పందించలేదన్నారు. ఈ అరాచకాలపై దళితులు ఏకం కావాలని బీసీ పిలుపునిచ్చారు. మే 13న మీ ఓటును ఎన్‌డీఏ కూటమి అభ్యర్థికి వేయాలన్నారు. జగన్ యువత జీవితాలతో ఆడుకుంటున్నారన్నారు. వారి భవిష్యత్‌ను నాశనంచేస్తున్నారన్నారు. వీటిని దృష్టిలో పెట్టుకొని టీడీపీ కూటమికి ఓటు వేయాలని కోరారు. మైనార్టీ హక్కులను కాపాడే బాధ్యత తాము తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు లింగన్న, చాందిని, జనసేన నాయకులు సురేశ్,గురప్ప పాల్గొన్నారు.

జగన్ హయాంలో ఆంధ్రప్రదేశ్ సర్వనాశనం

కొలిమిగుండ్ల: సీఎం జగన్ పాలనలో ఆంధ్రప్రదేశ్ సర్వనాశనం అయిందని బనగానపల్లె మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్‌రెడ్డి విమర్శించారు. సోమవారం అవుకు మండలం రామాపురంలో బాబుష్యూరిటీ భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా సూపర్‌సిక్స్ కరపత్రాలను ఇంటింటికి తిరిగి ప్రచారం చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఐవీపక్కీరారెడ్డి, ఉగ్రసేనారెడ్డి, ఎస్.రామకృష్ణారెడ్డి, కాట్రెడ్డి మల్లిఖార్జునరెడ్డి, వంగల పరమేశ్వరరెడ్డి, మారంపుల్లారెడ్డి, పక్కీరాగౌడ్, భాస్కర్‌రెడ్డి, చంద్ర, శివరామిరెడ్డి, నారపురెడ్డి పాల్గొన్నారు.

అవుకు: సీఎం జగన్ పాలనలో ఆంధ్రప్రదేశ్ సర్వనాశనమైందని బనగానపల్లె మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్‌రెడ్డి అన్నారు. సోమవారం అవుకు మండలం రామాపురంలో బాబుష్యూరిటీ భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా సూపర్‌సిక్స్ కరపత్రాలను ఇంటింటికి తిరిగి ప్రచారం చేశారు. బీసీ మాట్లాడుతూ బనగానపల్లె నియోకవర్గంలో తాగునీటి సమస్యలతో ప్రజలు ఇబ్బందులు పడుతుంటే ఎమ్మెల్యే పట్టించుకోవడం లేదని విమర్శించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఐవీ పక్కీరారెడ్డి, ఉగ్రసేనారెడ్డి, ఎస్.రామకృష్ణారెడ్డి, కాట్రెడ్డి మల్లికార్జునరెడ్డి, వంగల పరమేశ్వరరెడ్డి, మారం పుల్లారెడ్డి, పక్కీరాగౌడ్, భాస్కర్‌రెడ్డి, చంద్ర, శివరామిరెడ్డి, నారపురెడ్డి, అధిక సంఖ్యలో టీడీపీ జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు ప్రజలు, బీసీ అభిమానులు పాల్గొన్నారు.



అవుకు మండలం రామాపురంలో సూపర్‌సిక్స్ కరపత్రాలు పంపిణీ చేస్తున్న బీసీ జనార్దన్‌రెడ్డి

54వ శంకరానంద స్వామి ఆరాధనోత్సవం



చాగలమర్రి శివరామానంద ఆశ్రమంలో హోమం చేస్తున్న వేద పండితులు

చాగలమర్రి, ఏప్రిల్ 1: చాగలమర్రి గ్రామంలోని శివరామానంద ఆశ్రమంలో సోమవారం శంకరానంద స్వామి 54వ ఆరాదన మహోత్సవాలు ఘనంగా నిర్వహించారు. అభినవ శంకరానందస్వా మి పతాకాన్ని ఆవిష్కరించి ఆరాదన ఉత్సవాలు ప్రారంభించారు. అనంతరం కలశ స్థాపన, గణపతి హోమం, దీపారాదన, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆళ్లగడ్డ ఆశ్రమ పీఠాధిపతి యోగేశ్వరానందగిరి, ఉరవ కొండ పీఠాధిపతి రాజేంద్ర మహాస్వామి, శ్రీకాళహస్తి చెందిన స్వప్రకానంద, ఆదోనికి చెందిన అనంతానంద గిరి స్వాములచే ఉపన్యాస కార్యక్రమాలు నిర్వహించారు. ప్రతి ఒక్కరు ధ్యానం, ఆధ్యాత్మిక చింతన కలిగి ఉండాలని సూచించారు.

నాటుసారా బట్టీలపై విస్తృత దాడులు

బేతంచెర్ల, ఏప్రిల్ 1: మండలంలోని బుగ్గానిపల్లె తాండా కొండ ప్రాంతాల్లో నాటుసారా బట్టీలు నిర్వహిస్తున్నారన్న సమాచారం మేరకు బేతంచెర్ల సీఐ ప్రియతమ్ రెడ్డి, ఎస్‌ఐ శివశంకర్ నాయక్ ఆధ్వర్యంలో నాటుసారా బట్టీలపై పోలీసులు విస్తృత దాడులు సోమవారం నిర్వహించారు. ఈ దాడుల్లో తాండ గ్రామానికి చెందిన దశావత్ శ్రీను నాయక్ చెందిన పెద్ద నాటుసారా బట్టితో పాటు 50 లీటర్ల పులిసిన బెల్లం ఊటను ధ్వంసం చేసి, 10 లీటర్ల నాటు సారా స్వాధీనం చేసుకున్నట్లు ఆయన తెలిపారు.

పింఛన్ల సొమ్ము కాంట్రాక్టర్లకు ధారాదత్తం

● డోన్ టీడీపీ అభ్యర్థి కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి

డోన్, ఏప్రిల్ 1: పింఛన్ల సొమ్మును సీఎం జగన్ కాంట్రాక్టర్లకు ధారాదత్తం చేయడం చాలా దారుణమని టీడీపీ కూటమి డోన్ అభ్యర్థి కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి అన్నారు. సోమవారం పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి విలేకరులతో మాట్లాడుతూ ఖజానాలో ఉన్న రూ.13 వేల కోట్లకు పైగా ఉన్న సొమ్మును సీఎం జగన్ తన వాళ్లకు సంబందించిన కాంట్రాక్టర్లకు దారాదత్తం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నికల కోడ్‌కు విరుద్ధంగా గత మార్చి 16వ తేదీ నుంచి 30వ తేదీ వరకు ఖజానాను ఖాళీ చేసి పేదలైన పింఛన్‌దారుల కడుపు కొట్టాడని ధ్వజమెత్తారు. ఆసరా, చేయూత, విద్యాదీవెన, ఈబీసీ నేస్తం డబ్బుల తోపాటు ఆరోగ్యశ్రీ ఆసుపత్రులకు ఇవ్వాల్సిన రూ.13వేల కోట్ల నిధులను తన అనుకూల కాంట్రాక్టర్లకు చెల్లించడం సీఎం జగన్ మరో మోసానికి పాల్పడ్డారని ఆరోపించారు. వాలంటీర్ల వ్యవస్థను వైసీపీ ప్రభుత్వం దుర్వినియోగం చేస్తున్నందు వల్లనే కేంద్ర ఎన్నికల కమిషన్ పింఛన్ల పంపిణీకి దూరంగా పెట్టిందన్నారు. టీడీపీ అధికారంలోకి రాగానే చంద్రబాబు పేదల పింఛన్‌ను నెలకు రూ.4 వేలకు పెంచి ఇంటి వద్దకే అందించడం జరుగుతుందన్నారు. జగన్‌కు ప్రజలు ఓటుతో ఎన్నికల్లో బుద్ధి చెప్పాలని కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి పిలుపునిచ్చారు.

● లద్దగిరిలోని కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి, తనయుడు కోట్ల రాఘవేంద్రరెడ్డిని సోమవారం డోన్ టీడీపీ నాయకులు ధర్మవరం చిన్న నాగిరెడ్డి, భరత్ రెడ్డి ఆధ్వర్యంలో షేక్షావలి చౌదరి, ఎర్రమల నాయుడు, బుగ్గానిపల్లి రమేష్, లోకేశ్‌గౌడు తదితరులు మర్యాద పూర్వకంగా కలిశారు.

బేతంచెర్ల: అభివృద్ధి ఎక్కడ బుగ్గనా అని కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి ప్రశ్నించారు. సోమవారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డికి ఓటమి భయం పట్టుకుందన్నారు. మండలంలోని వీరాయిపల్లె, ముద్దవరం, ముసలాయ చెరువు గ్రామాల్లో టీడీపీ మండల కన్వీనర్ ఉన్నం ఎల్ల నాగయ్య అధ్యక్షతన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పోలూరు వెంకటేశ్వరరెడ్డి, ఎల్ల నాగయ్య, పోలూరు రాఘవరెడ్డి, బుగ్గన ప్రసన్న లక్ష్మి, బుగ్గన ప్రభాకర్ రెడ్డి, జాకీరుల్లా బేగ్, భీమేష్ రెడ్డి, ఉన్నం చంద్రశేఖర్, సుధాకర్, తిరుమలేష్ చౌదరి, షేక్షావలి చౌదరి, రవీంద్ర నాయక్, రామాంజనేయులు, శ్రీనివాస్ యాదవ్, నాగరాజు పాల్గొన్నారు.



కోట్ల సూర్యప్రకాష్ రెడ్డికి బొకే అందజేస్తున్న డోన్ నియోజకవర్గ టీడీపీ నాయకులు

వైసీపీ మాయమాటలను నమ్మకండి

ప్యాపిలి, ఏప్రిల్ 1: ఎన్నికల సమయంలో చెప్పే వైసీపీ నేతల మాయ మాటలను నమ్మకండని మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ అన్నారు. సోమవారం మండలంలోని బావిపల్లి, హుసేనాపురం గ్రామాల్లో నిర్వహించిన బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం సుజాతమ్మ ఇంటింటా తిరిగి టీడీపీ మేనిఫెస్టోను పత్రాలను ప్రజలకు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు టి శ్రీనివాసులు, వై లక్ష్మీనారాయణయాదవ్, లింగన్న, ప్రసాద్, ఆర్ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.



ప్యాపిలి: బావిపల్లిలో మహిళలతో మాట్లాడుతున్న కోట్ల సుజాతమ్మ

● ప్యాపిలిలో టీడీపీ యువనాయకుడు కోట్ల రాఘవేంద్రరెడ్డి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు ఎర్రగుంట్లపల్లి వెంకటేశ్వరరెడ్డి, రాజా నారాయణమూర్తి, అంకిరెడ్డి, రమేష్‌రెడ్డి, నాగేంద్ర, గండికోట పెద్దరామాంజినేయులు, రజనీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు.

డోన్: పట్టణంలోని 26వ వార్డులో టీడీపీ నాయకురాలు కోట్ల నివేధిత మున్సిపల్ మాజీ చైర్మన్ కోట్రికే గాయత్రీదేవితో కలిసి ఆమె ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి విజయ భట్టు, మర్రి మణి, అంజనేయగౌడు, పాల్‌రాజు, ఎల్లగౌడు, రంగయ్య గౌడు, జయరాముడు, పుల్లయ్యగౌడు, ఖాజా, వెంకటస్వామి, లారీల భాషా, చాటకొండ రజిని, ఎన్‌ఈ సరోజ, జనసేన నాయకులు ఆలా మోహన్ రెడ్డి, బీజేపీ నాయకులు ఆర్మీ రామయ్య పాల్గొన్నారు.

టీడీపీతోనే అభివృద్ధి

ఆళ్లగడ్డ, ఏప్రిల్ 1: టీడీపీతోనే అభివృద్ధి సాధ్యమని టీడీపీ నాయకుడు భార్గవ్‌రామ్‌నాయుడు అన్నారు. రుద్రవరం మండలం ముత్తలూరు గ్రామానికి చెందిన వైసీపీకి చెందిన 30 కుటుంబాలు టీడీపీలో చేరాయి. ఎన్నికల్లో టీడీపీని గెలిపించేందుకు ప్రజలంతా సిద్ధంగా ఉన్నారని అన్నారు. టీడీపీలో చేరిన వారిలో ప్రహ్లాద్, నాయుడు, ఓబులేసు, పెద్ద ఓబన్న ఉన్నారు.

నూతన కమిటీ సభ్యులకు సన్మానం



న్యాయవాదులను సన్మానిస్తున్న దృశ్యం

డోన్(రూరల్), ఏప్రిల్ 1: డోన్ బార్ అసోసియేషన్‌కు ఎన్నికైన నూతన కమిటి సభ్యులకు తోటి న్యాయవాదులు సన్మానించారు. డోన్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా టీఈ వేణుగోపాల్ గౌడు, ఉపాధ్యక్షులుగా బద్దెల వెంకటేశ్, జనరల్ సెక్రటరీ కృష్ణప్రసాద్, జాయింట్ సెక్రటరీ నాగరాజు గౌడు, కోశాదికారి మంగమూరి శ్రీనివాసులను పూలమాలలు వేసి తోటి న్యాయవాదులు సత్కరించి అభినందనలు తెలిపారు.

హక్కులకు భంగం కలిగిస్తున్నారు

కొలిమిగుండ్ల, ఏప్రిల్ 1: హక్కులకు భంగం కలిగిస్తున్నారని కల్వటాల సర్పంచు సుమలత ఆరోపించారు. పంచాయతీ భవనం గత నెల 6న ప్రారంభించారు. తాళాలు ఇవ్వాలని అడిగితే భవన నిర్మాణం బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని, అవి రాగానే ఇస్తామని సమాధానం ఇస్తున్నారన్నారు. సోమవారం గ్రామంలో ఈవోఆర్డీ శ్రీహరి తమ పంచాయతీ కార్యదర్శి ఆధ్వర్యంలో పంచాయతీ కార్యాలయం ఆరుబయట సమావేశం నిర్వహించుకోవాల్సిన దుస్థితి ఏర్పడిందని సర్పంచ్ వాపోయారు. ఉప సర్పంచ్‌పై చర్యలు తీసుకోవాలని కోరారు.



కార్యాలయం బయట సమావేశం నిర్వహిస్తున్న దృశ్యం

ఒట్టిపోయిన కుందూ



మల్లేవేముల సమీపంలో నీరు లేక ఒట్టిపోయిన కుందూ

చాగలమర్రి, ఏప్రిల్1: మండలంలోని రాజోలి ఆనకట్ట నుంచి మల్లేవేముల గ్రామ సమీపంలోగల కుందూ నది నీరు లేక ఒట్టిపోయింది. వేసవి కాలంలో నీరు లేకపోవడంతో రైతులు, మూగ జీవాలు నీటి కోసం ఇబ్బందులు పడుతున్నారు. రెండు నెలలకు ముందే నీరు లేక పోవడంతో కుందూ పరిసర గ్రామాల ప్రజలు తాగు, సాగు నీటి కోసం కష్టాలు పడుతున్నారు. ఎగువ నుంచి కుందూకు నీరు విడుదల చేయాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

ఎండుతున్న వరి పైరు



చిన్నబోదనం గ్రామ సమీపంలో ఎండిన వరి పంట

చాగలమర్రి, ఏప్రిల్ 1: రైతన్నలకు వేసవి కష్టాలు మొదలయ్యాయి. నదులు, చెరువులు, కుంటలు, వక్కిలేరు ఎండిపోవడంతో నీరు లేక సాగు చేసిన వరి పంట ఎండిపోతోంది. మండలంలోని చిన్నబోదనం గ్రామ సమీపంలో బోర్ల కింద రైతులు సాగు చేసిన వరి పంట ఎండు ముఖం పట్టింది. బోరులో నీరు అడుగంటి పోవడంతో పంటలను ఎండబెట్టుకోవాల్సి వస్తోందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. పొలాల పక్కనే ఉన్న వక్కిలేరులో కూడా నీరు లేకపోవడంతో పంట తడుపుకోవడానికి వీలు లేకపోయిందని రైతు నరసింహులు పేర్కొన్నారు. నీరు లేకపోవడంతో సాగు చేసిన వరి పంటను వదిలేసుకోవాల్సి వచ్చిందని అన్నారు. వక్కిలేరుకు నీరు వస్తుందన్న ఆశతో పంటలు సాగు చేశామని, ఇప్పుడు నీరు లేక పంటలు ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.

'టీడీపీతోనే బీసీల సంక్షేమం'

చాగలమర్రి, ఏప్రిల్ 1: రాష్ట్రంలో టీడీపీతోనే బీసీల సంక్షేమం సాధ్యమని బీసీ సెల్ నంద్యాల అధికార ప్రతినిధి సల్లా నాగరాజు అన్నారు. సోమవారం బీసీ సంఘం కార్యాలయం వద్ద జయహో బీసీ కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో బీసీ సంఘం నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

'వడదెబ్బపై అప్రమత్తంగా ఉండాలి'

చాగలమర్రి, ఏప్రిల్ 1: గ్రామాల్లో ప్రజలు వడదెబ్బ పట్ల అప్రమత్తంగా ఉండాలని వైద్యులు ఇమ్రాన్ సూచించారు. సోమవారం చాగలమర్రి ప్రభుత్వ వైద్యశాలలో ఆయన మాట్లాడుతూ రోజు రోజుకు ఎండల తీవ్రత, వడగాల్పులు అధికమయ్యాయని, చిన్నారులు, వృద్ధులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

'ఎన్నికల నియమావళి పాటించాలి'

చాగలమర్రి, ఏప్రిల్ 1: గ్రామాల్లో ఆయా రాజకీయ పార్టీ నాయకులు ఎన్నికల నియమావళిని తప్పనిసరిగా పాటించాలని తహసీల్దార్ రమణమ్మ సూచించారు. సోమవారం ఆమె మాట్లాడుతూ సభలు, సమావేశాలు నిర్వహించే ముందు అనుమతి తీసుకోవాలన్నారు. ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

నేటి నుంచి ధార్మిక కార్యక్రమాలు

ఉయ్యాలవాడ, ఏప్రిల్ 1: మండలంలోని అల్లూరు గ్రామంలో మంగళవారం నుంచి మూడురోజుల పాటు ధార్మిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు హిందూ ధర్మ ప్రచార పరిషత్ జిల్లా కార్యనిర్వాహకుడు మల్లు వెంకటరెడ్డి తెలిపారు. సోమవారం కరపత్రాలను వారు విడుదల చేశారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ ఆరికట్ల శివరామకృష్ణారెడ్డి, హిందూ ధర్మ ప్రచార సమితి సభ్యులు శివరామకృష్ణయ్య, ప్రతాప్‌రెడ్డి, శివమోహన్‌రెడ్డి, కృష్ణమోహన్, సుబ్బరామయ్య పాల్గొన్నారు.

బైరెడ్డి శబరిని కలిసిన నాయకులు



బైరెడ్డి శబరితో మండల నాయకులు

ఉయ్యాలవాడ, ఏప్రిల్ 1: మండలంలోని టీడీపీ నాయకులు ఆదివారం నంద్యాల పార్లమెంటు ఎంపీ అభ్యర్థి బైరెడ్డి శబరిని మర్యాదపూర్వకంగా కలిశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పుల్లయ్య, నూకా చంద్రశేఖర్‌రెడ్డి, కర్రరమేష్ రెడ్డి, సురేశ్‌రెడ్డి, రాజారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రైతులను మోసగించిన ఎమ్మెల్యే : అఖిలప్రియ



మాట్లాడుతున్న అఖిలప్రియ

నంద్యాల, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే బిజేంద్రారెడ్డి రైతులను మోసగించారని మాజీ మంత్రి, టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి భూమా అఖిలప్రియ మండిపడ్డారు. చందలూరు, చిలకలూరు, మాచుపల్లె, బత్తులూరు, కొండమాయపల్లె గ్రామాల రైతులు సోమవారం ఆళ్లగడ్డలో అఖిలప్రియను ఆమె నివాసంలో కలిశారు. తాము తీవ్రంగా నష్టపోయామని ఆవేదన వ్యక్తం చేశారు. తాము ఎవరికీ అన్యాయం చేయలేదని, ఎవరినీ మోసం చేయలేదని చెబుతున్నారని, అయితే నీరు లేక పంటలు ఎండిపోయాయని రైతులు అఖిలప్రియ దృష్టికి తెచ్చారు. అనంతరం అఖిలప్రియ విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఎవరినీ మోసం చేయలేదని అహోబిలం లక్ష్మీనరసింహస్వామి ఎదుట ప్రమాణం చేసేందుకు ఎమ్మెల్యే బిజేంద్రారెడ్డి తల్లి ఇందిరమ్మ సవాల్ విసిరి దేవునికే శఠగోపం పెట్టేందుకు సిద్ధమయ్యారని ఆరోపించారు. ఐదేళ్లలో రైతులకు, ప్రజలకు ఏమి చేశారని ప్రశ్నించారు. రైతులు మాట్లాడుతూ ఎర్రగుడిదిన్నె చెరువులోని నీటిని నమ్ముకొని పంటలు సాగు చేసుకున్న తరుణంలో ఎమ్మెల్యే బిజేంద్రారెడ్డి ఆదేశాల మేరకు ఆయన అనుచరులు నీటిని వదలక పోవడంతో రెండు వేల ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.

ఎన్నికల నియమావళికి లోబడి పని చేయాలి

రుద్రవరం, ఏప్రిల్ 1: ఎన్నికల నియమావళికి లోబడి పనిచేయాలని అసిస్టెంటు రిటర్నింగ్ ఆఫీసరు మురళీమోహన్ అన్నారు. సోమవారం తహసీల్దారు కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. సమీక్షలో మాట్లాడుతూ ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తే చర్యలు తప్పవన్నారు. గ్రామ వలంటీర్లను ఏ పనిలో కూడా ఉపయోగించవద్దని ఎన్నికల సంఘం ఉత్తర్వులు ఉన్నాయన్నారు. నిర్లక్ష్యం చేస్తే అందుకు బాధ్యులు మీరేనని వీఆర్వోలను హెచ్చరించారు. మట్టి తవ్వకాలు ఉంటే ఏడీ మైనింగ్ నుంచి అనుమతి తీసుకోవాలని సూచించారు. మట్టి తవ్వకాలకు రెవెన్యూ అధికారులు అనుమతి ఇవ్వడం లేదన్నారు.

చెరువు పనులపై ఆరా

మండలంలో ఎన్నికల కోడ్ ఉల్లంఘన, వెంగనపల్లె చెరువు పనులు ప్రారంభం అనే శీర్షిక ఆంధ్రజ్యోతిలో సోమవారం ప్రచురితమైంది. మండల కోడ్ ఆఫ్ కాండక్ట్ అధికారి రామచంద్ర చెరువు పనులపై ఆరా తీసినట్లు సమాచారం. చెరువు పనులపై మైనర్ ఇరిగేషన్ అధికారులను నివేదిక కోరినట్లు సమాచారం.